



# పెన్ పవర్




తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 11 సంచిక : 325 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు బుధవారం 30 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 325 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE WED 30 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada,Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## ఏపీ అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామిగా ఉంటుందన్న మంత్రి టాన్సీ లెంగ్.. ధన్యవాదాలు తెలిపిన సీఎం చంద్రబాబు

- ఏపీ, అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామిగా ఉంటుందన్న మంత్రి టాన్సీ లెంగ్
- 2019 తర్వాత ఏపీలో వచ్చిన ప్రభుత్వం నుంచి సహకారం ఆగిపోయిందన్న మంత్రి
- సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటన ఫలప్రదం కావాలని ఆకాంక్షించిన టాన్సీ లెంగ్
- ధన్యవాదాలు తెలుపుతూ.. సింగపూర్ భాగస్వామ్యం విలువైందన్న చంద్రబాబు



పెన్ పవర్ డెస్క్:సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనలో ఉండగానే ఆ దేశ మానవనరులు, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి టాన్సీ లెంగ్ కీలక ప్రకటన చేశారు. వివిధ రంగాల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి వివరాలు 2లో..

# త్వరలోనే యాప్... తప్పు చేసిన వారికి సినిమా చూపించడం ఖాయం

పెన్ పవర్ డెస్క్:తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సమావేశంలో వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ ఆసక్తికర ప్రకటన చేశారు. త్వరలో పార్టీ తరఫున ఒక మొబైల్ యాప్‌ను తీసుకువస్తున్నామని, ప్రభుత్వ వేధింపులు లేదా అన్యాయాలకు గురైన వారు ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని ఆయన వెల్లడించారు.జగన్ మాట్లాడుతూ, “త్వరలోనే పార్టీ తరఫున యాప్ విడుదలచేస్తాం. ప్రభుత్వ వేధింపులు జరిగినా, అన్యాయం జరిగినా వెంటనే ఆ యాప్‌లో వివరాలు నమోదు చేయవచ్చు. ఎవరి కారణంగా అయినా అన్యాయంగా ఇబ్బంది పడ్డా, వారిపై ఆ యాప్ లో ఫిర్యాదు చేయొచ్చు... ఆధారాలు కూడా ఆ యాప్‌లో అందించవచ్చు... ఆ ఫిర్యాదు వెంటనే మన డిజిటల్ సర్వర్‌లోకి వచ్చేస్తుంది” అని తెలిపారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు ‘రెడ్‌బుక్ రాజ్యాంగం’ నడుస్తోందని ఆరోపిస్తున్న నేపథ్యంలో జగన్ ఈ డిజిటల్ ఉద్యమానికి తెర లేపడం గమనార్హం. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేశ్ ‘రెడ్‌బుక్’ తీసుకొచ్చారని, తప్పుచేసినవారిని వదిలేది లేదని హెచ్చరించారని జగన్ గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ



ఫిర్యాదులపై కచ్చితంగా పరిశీలన చేస్తామని జగన్ స్పష్టం చేశారు. అన్యాయానికి గురైన వారంతా ఈ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని, ఆధారాలుగా ఉన్న వీడియోలు, పత్రాలను అప్‌లోడ్ చేయవచ్చని సూచించారు. “ఈ ఫిర్యాదులపై పరిశీలన జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. తప్పు చేసిన వారందరికీ సినిమా చూపించడం ఖాయం” అని జగన్ మరోసారి హెచ్చరించారు.

## గతంలో పెట్టుబడుల పేరుతో వైసీపీ నేతలు విదేశాల్లో విహార యాత్రలు చేశారు

- సింగపూర్ లో సీఎం చంద్రబాబు బృందం పర్యటన
- రాష్ట్రం కోసం చంద్రబాబు, లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్న మంత్రి స్వామి
- చంద్రబాబు అపోలో టైర్స్ కంపెనీ తీసుకువచ్చారని వెల్లడి
- జగన్ ఐదేళ్లలో సైకిల్ ట్యూబ్ కంపెనీ కూడా తీసుకురాలేకపోయారని ఎద్దేవా



పెన్ పవర్ డెస్క్:ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాం జనేయ స్వామి ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం సింగపూర్ పర్యటనపై స్పందించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వ వివరాలు 2లో..

### ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమావేశం..

# డీకే శివకుమార్ దూరం!

- అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 50 కోట్ల గ్రాంట్ ఇవ్వనున్నట్లు సీఎం వెల్లడి
- నిధుల కేటాయింపుకు సంబంధించి విధానసౌధలో సమావేశం కానున్న ఎమ్మెల్యేలు
- డీకే శివకుమార్ దూరంగా ఉండటంపై కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆందోళన

పెన్ పవర్ డెస్క్:కర్ణాటకలో ‘ముఖ్యమంత్రి మార్పు’ అంశం చర్చనీయాంశంగా మారింది. తాజాగా, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎమ్మెల్యేలతో సమావేశమవుతున్నారు. ఈ భేటీకి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 50 కోట్ల గ్రాంట్ ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల ప్రకటించారు. ఆ నిధుల కేటాయింపునకు సంబంధించి సిద్ధరామయ్య విధానసౌధలో సమావేశం కానున్నారు. కీలక సమావేశానికి డీకే శివకుమార్ దూరంగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని కొంతమంది కాంగ్రెస్ నాయకులు వివరాలు 2లో..



### నాగార్జున సాగర్ కు భారీగా వరద ప్రవాహం..

# నిండు కుండలా జలాశయం

- శ్రీశైలం నుంచి సాగర్ ప్రాజెక్టుకు 2,01,743 క్యూసెక్కుల వరద నీరు
- ప్రస్తుత సాగర్ కు ఔట్ ఫ్లో 41,882 క్యూసెక్కులు
- ప్రస్తుత సాగర్ నీటి మట్టం 586.60 అడుగులు

పెన్ పవర్ డెస్క్:ఈ ఏడాది కృష్ణానదీ పరివాహక ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటకలలో కురిసిన భారీ వర్షాలకు ముందస్తుగానే జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. ఆల్మట్టి నుంచి శ్రీశైలం వరకు జలాశయాలు గత వారంలోనే గరిష్ఠ స్థాయి మట్టాలకు చేరాయి. దీంతో శ్రీశైలం జలాశయానికి అదనంగా వచ్చే వరదనంతా నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.శ్రీశైలం జలాశయానికి 1,98,920 క్యూసెక్కుల వివరాలు 2లో..



## చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏనుగుల కలకలంపై పవన్ కల్యాణ్ సమీక్ష



- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏనుగుల దాడులు
- ఇటీవలే ఏనుగుల దాడిలో ఓ రైతు మృతి
- తిరుపతి శ్రీవారి మెట్టు మార్గం వద్ద ఏనుగుల సంచారం

పెన్ పవర్ డెస్క్:గత కొన్నేళ్లుగా ఏనుగులు అటవీ ప్రాంతాలను వదిలి జనావాసాల్లోకి ప్రవేశిస్తూ, పొలాల్లో పనిచేసుకుంటున్న వారిపై దాడులు చేసి చంపేస్తుండడం తెలిసిందే. ఏపీలోనూ ఇలాంటి ఘటనలు చాలా జరిగాయి. ఇటీవలే చిత్తూరు జిల్లాలో రామకృష్ణంరాజు అనే రైతు ఏనుగుల దాడిలో బలయ్యాడు. నిన్న సోమవారం కూడా తిరుపతి శ్రీవారి మెట్టు మార్గంలో పంప్ హౌస్ వద్ద వివరాలు 2లో..

### ఉగ్రవాదుల మతం చూసి బాధపడొద్దు..

## అఖిలేశ్ యాదవ్ కు అమిత్ షా కౌంటర్

- ఆపరేషన్ సిందూర్ పై చర్చ సందర్భంగా లోక్ సభలో హెూంమంత్రి ప్రసంగం
- తనకు అడ్డుపడుతున్న ప్రతిపక్ష సభ్యులకు కౌంటర్ ఇచ్చిన షా
- పాకిస్థాన్ తో మీరు చర్చలు జరుపుతారా అంటూ ప్రశ్న
- ఆపరేషన్ మహదేవ్ వివరాలను పార్లమెంట్ లో వెల్లడించిన హెూంమంత్రి



పెన్ పవర్ డెస్క్:జమ్మూకశ్మీర్ లోని పహల్గామ్ లో పర్యాట కులను ఉగ్రవాదులు మతం అడిగి మరీ కాల్చి చంపారని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా లోక్ సభలో వెల్లడించారు. ఇది అత్యంత దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. ఉగ్రదా డి జరిగిన వెంటనే భద్రతాబలగాలు అప్రమ త్తమయ్యాయని, ఉగ్రవాదుల కోసం వేట ప్రారంభించడంతో పాటు వారు దేశం దాటకుండా ఎక్కడికక్కడ చర్యలు చేపట్టాయని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ పై లోక్ సభలో చేపట్టిన వివరాలు 2లో..

## పిన్నెల్లి ప్రధాన అనుచరుడు తురకా కిశోర్ కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ



- తనపై ఎఫ్ఐఆర్ లు నమోదు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలన్న కిశోర్
- సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు
- పిటిషన్ ను విచారణకు స్వీకరించలేమన్న అత్యున్నత న్యాయస్థానం

పెన్ పవర్ డెస్క్:వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అనుచరుడు తురకా కిశోర్ కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తురకా కిశోర్ దాఖలు చేసిన రిట్ పిటిషన్ ను విచారణకు స్వీకరించేందుకు సుప్రీం ధర్మాసనం వివరాలు 2లో..

## మోదీ సర్కార్ భద్రతా వైఫల్యమే పహల్గాం ఉగ్రదాడి

పెన్ పవర్ డెస్క్:పహల్గాం ఉగ్రదాడి పూర్తి మోదీ సర్కార్ భద్రతా వైఫల్యమే అన్నారు కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ. పహల్గాం దాడికి బాధ్యత వహించకుండా.. ఆపరేషన్ సింధూర్ క్రెడిట్ తీసుకుంటోందని విమర్శించారు. పాకిస్తాన్ లో కూర్చొని మనదేశంపై దాడి చేస్తే ఐబీ ఏం చేస్తోందని ప్రియాంకగాంధీ ప్రశ్నించారు. ఇంటెలిజెన్స్ వైఫల్యానికి IB చీఫ్ రాజీనామా చేశాడా?..కేంద్ర హెూంమంత్రి రిజైన్ చేశాడా?..ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి కాదా? కనీస బాధ్యత కూడా హెూంమంత్రి తీసుకోలేకపోయాడు అని విమర్శించారు ప్రియాంకగాంధీ. పహల్గాం దాడికి ఎవరూ బాధ్యత వహిస్తారో చెప్పాలని



కేంద్రాన్ని నిలదీశారు ప్రియాంక గాంధీ. కాశ్మీర్ లో పరిస్థితులు మారిపోయాయని కేంద్ర గొప్పలు చెప్పుకుంటోంది.. నిజంగా మారిపోతే పహల్గాంలో వివరాలు 2లో..

## పాడి కౌశిక్ రెడ్డికి 14 మంది ప్రైవేటు గన్‌మన్‌లతో భద్రత పెంపు!

- ప్రభుత్వం తరఫున ఇప్పటికే నలుగురు గన్‌మన్‌లు
- తాజాగా 14 మంది ప్రైవేటు గన్‌మన్‌లతో మరింత భద్రత
- ఇటీవల ముఖ్యమంత్రిపై విమర్శల నేపథ్యంలో పార్టీ తరఫున భద్రత పెంచిన బీఆర్ఎస్




పెన్ పవర్ డెస్క్:బీఆర్ఎస్ నాయకుడు, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ ప్రైవేటు సెక్యూరిటీని ఏర్పాటు చేసింది. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికైనందున ప్రభుత్వం పరంగా ఆయనకు నలుగురు గన్‌మన్‌లు ఉన్నారు. తాజాగా బీఆర్ఎస్ ఆయనకు అదనంగా మరో 14 మంది ప్రైవేటు గన్‌మన్‌లను నియమించింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఆయన విమర్శలకు కాంగ్రెస్ నాయకులు సైతం ప్రతి విమర్శలు చేశారు. ముఖ్యమంత్రిపై ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు. ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు, ప్రజలు ఉరికించి కొడతారని కూడా కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో పాడి కౌశిక్ రెడ్డి పార్టీ తరఫున పెద్ద ఎత్తున సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

### మూసీ నది ఆక్రమించి పార్కింగ్ షెడ్లు ...

## తొలగించిన హైడ్రా



పెన్ పవర్ డెస్క్:మూసీ నది ఆక్రమించి నిర్మించిన పార్కింగ్ షెడ్లను తొలగించింది హైడ్రా. మంగళవారం ( జులై 29 ) చాదర్ ఘాట్ బ్రిడ్జి ప్రాంతంలో కూల్చివేతలు చేపట్టారు హైడ్రా అధికారులు. చాదర్ ఘాట్ బ్రిడ్జి నుంచి ఉస్మానియా మార్చురీ వరకు ఉన్న ఆక్రమణలపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో కూల్చివేతలు చేపట్టారు హైడ్రా అధికారులు. మూసి నదిని ఆక్రమించి వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారు ఆక్రమణదా రులు.మూసీ నదిలో మట్టి పోసి మరీ షెడ్డులు నిర్మనించి కిరాయికి ఇస్తున్నారు ఆక్రమ ణదా రులు. దీంతో హైడ్రాను ఆశ్రయించి ఫిర్యాదు వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# నల్లారిలో నిరాశ.. ఇక ఇన్నింగ్స్ ముగిసినట్లేనా?

మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఎలాంటి పదవులు లేకుండా సాగిపోతున్నారు. ఆయన బీజేపీలో చేరి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నప్పటికీ దాదాపు పదేళ్ల నుంచి పదవులకు దూరంగా ఉంటున్నారు. చిన్న వయసులోనే రాజకీయాల్లో పదవులకు దూరంగా ఉండటం కష్టమే. రాష్ట్ర విభజనతో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి రాజకీయాలు గ్యాప్ ఇచ్చిగ్యాప్ ఇచ్చి మరీ పార్టీలు మారినా ఫలితం లేకుండా పోతుంది. దీంతో నల్లారి అనుచరులు ఆందోళన చెందుతున్నారు. సొంతపార్టీ పెట్టుకున్నప్పటికీ ప్రజలు ఆదరించలేదు. కాంగ్రెస్ లోకి వెళ్లినా అక్కడా ఎలాంటి పదవులు దక్కలేదు. చివరకు బీజేపీలో చేరి ఎంపీ అవ్వాలన్న కల కూడా నెరవేరలేదు.

**పదేళ్ల నుంచి పదవి లేకుండా...**

2014 నుంచి ఐదేళ్ల పాటు విరామం తీసుకున్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ కాంగ్రెస్ కు ఏపీలోనూ, దేశంలోనూ బలోపేతం కాదని భావించిన నల్లారి వెనువెంటనే తన డెసిషన్ ను మార్చుకున్నారు. ఇక తర్వాత బీజేపీలో చేరారు. బీజేపీలో చేరడంతో మాజీ ముఖ్యమంత్రిగా గౌరవించిఆయన కోరుకున్న రాజంపేట లోక్ సభ నియోజకవర్గం సీటు ఇచ్చింది. కానీ కూటమి పార్టీలకు అన్ని చోట్ల విజయం దక్కినా, రాజంపేటలో మాత్రం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఓటమి పాలయ్యారు. రాజంపేటలో ఓటమిని నల్లారి తట్టుకోలేకపోయారు. దీంతో ఆ నియోజకవర్గానికి కూడా దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇక ఇదే సమయంలో రాజ్యసభ పదవి అయినా దక్కుతుందని నల్లారి భావించారు.

**బీజేపీలో కనుచూపు మేరలో...**

కానీ బీజేపీ కేంద్ర నాయకత్వం మాత్రం కొత్తగా చేరిన వారికి పదవులు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అందులోనూ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి గత ఎన్నికల్లో టిక్కెట్ ఇచ్చినందున ఇక మరో పదవికి ఆయన పేరును పరిశీలనలోకి తీసుకునే ఛాన్స్ కూడా లేదని తెలిసింది. దీంతో ఆయన బీజేపీలో ఉన్నప్పటికీ సైలెంట్ గానే ఉన్నారు. ఎలాంటి పదవి లేకపోవడంతో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఎప్పటిలాగానే హైదరాబాద్ కే పరిమితమయ్యారు. అప్పుడప్పుడు బీజేపీ కార్యక్రమాలకు వస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో రాజకీయాలకు ఆయన సిద్ధంగా లేరని తెలుస్తోంది. దీంతో నల్లారిలో నిరాశ ఆవరించింది. వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియవు. దీంతో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఇక రాజకీయాలకు దూరంగా ఉంటే మేలన్న సూచనలు సన్నిహితుల నుంచి వినిపిస్తున్నాయి. అందుకే ఆయన ఏపీ రాజకీయాల గురించి కూడా మాట్లాడకుండా మౌనంగా ఉంటున్నారట. ఎదురు చూపులు చూడటం తప్ప ఆయన చేయగలిగిందేమీ లేదు.

# గతంలో పెట్టుబడుల పేరుతో వైసీపీ నేతలు విదేశాల్లో విహార యాత్రలు చేశారు

- మొదటి పేజీ తరువాయి

హయాంలో పెట్టుబడుల పేరుతో వైసీపీ నేతలు విదేశాల్లో విహార యాత్రలు చేశారని స్వామి విమర్శించారు. ఫారెన్ ట్రిప్పుల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేశారని అన్నారు. రాష్ట్రంలో విధ్వంస పాలన చేసి, సింగపూర్ తో ఏపీకి ఉన్న సత్సంబంధాలను దెబ్బతీశారని మండిపడ్డారు. ఇవాళ చంద్రబాబుపై ఉన్న నమ్మకంతో ఏపీకి పరిశ్రమలు క్యూ కడుతున్నాయని తెలిపారు. చంద్రబాబు రాష్ట్రానికి అపోలో టైర్స్ కంపెనీ తీసుకువచ్చారు... జగన్ తన ఐదేళ్లలో కనీసం సైకిల్ ట్యూబ్ కంపెనీ అయినా తెచ్చారా? అంటూ మంత్రి స్వామి దెప్పిపొడిచారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం... పరిశ్రమలు, పెట్టుబడులతో రాష్ట్ర యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు.

# చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏనుగుల కలకలంపై పవన్ కల్యాణ్ సమీక్ష

- మొదటి పేజీ తరువాయి

ఏనుగులు కనిపించాయి. సమీపంలోని పొలాలను ధ్వంసం చేశాయి.

ఈ నేపథ్యంలో, ఏపీ డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. తన శాఖ అధికారులు ఆయన ఇవాళ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏనుగుల గుంపులు పొలాలపైకి రాకుండా, వాటిని అటవీ ప్రాంతంలోకి పంపించే చర్యలను పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు. ఏనుగుల సంచారం ఉండే ప్రాంతాల్లో ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తుండాలని, గ్రామస్తులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ఏనుగుల తాకిడిపై వారికి ముందుగా సమాచారం అందిస్తుండాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఏనుగుల ప్రభావిత గ్రామాల్లో అటవీశాఖ సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

## నాగార్జున సాగర్ కు భారీగా వరద ప్రవాహం..

# నిండు కుండలా జలాశయం

- మొదటి పేజీ తరువాయి

మేర వరద పెరగడంతో నిన్న నాలుగు గేట్లు పది అడుగుల మేర ఎత్తి 1,08,260 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమల విద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 66,896 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

నాగార్జునసాగర్‌కు 2,01,743 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రస్తుతం సాగర్ ఔట్ ఫ్లో 41,882 క్యూసెక్కులుగా నమోదైంది. ఈరోజు ఉదయం గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తుండటంతో ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రకటన విడుదల చేశారు. ప్రజలు నదిలోకి వెళ్లవద్దని సూచించారు.సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 586.60 అడుగుల నీటి మట్టం ఉంది. సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.4 టీఎంసీలకు చేరుకోవడంతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు నుంచి సాగర్‌కు భారీ వరద కొనసాగుతోంది.

## మూసీ నది ఆక్రమించి పార్కింగ్ షెడ్లు ...

# తొలగించిన హైడ్రా

- మొదటి పేజీ తరువాయి

చేశారు స్థానికులు. స్థానికుల ఫిర్యాదుతో రంగం లోకి దిగిన హైడ్రా సుమారు పది ఎకరాల స్థలంలో ఆక్రమణలు తొలగించింది. కబ్జా చేసినవారంతా అక్కడ షెడ్లు వేసి, వాటికని బస్సులు, లారీల పార్కింగ్ కోసం అద్దెకు ఇచ్చి వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు అధికారులు.కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు భారీ పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. తికారం అనే వ్యక్తి మూడు ఎకరాలు, పూనమ్ చాంద్ యాదవ్ అనే వ్యక్తి ఎకరం 30 గుంటలు, జయకృష్ణ అనే వ్యక్తి 5 ఎకరాల 22 గుంటలు కబ్జా చేసినట్లు తెలిపారు హైడ్రా అధికారులు. ఆక్రమణలు తొలగించిన అధికారులు మళ్ళీ కబ్జాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమావేశం.. డీకే శివకుమార్ దూరం!

- మొదటి పేజీ తరువాయి

చెబుతుండగా, ఇదేం కొత్త కాదని అధికార వర్గాలు తెలిపాయి. గతంలోను తన పదవీ కాలంలో పలు సమావేశాలకు ఆయన దూరంగా ఉన్నారని చెబుతున్నారు. డీకే శివకుమార్ ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్నారని, అందుకే ఆయన సమావేశానికి హాజరుకాలేకపోతున్నారని మరికొందరు అంటున్నారు.

సాధారణంగా ఇలాంటి సమావేశాలు కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యాలయాల్లో జరుగుతాయి. ఈసారి విధానసౌధలో ముఖ్యమంత్రి ఛాంబర్‌లో నిర్వహిస్తున్నారు. డీకే శివకుమార్‌ను దూరం పెట్టడానికే విధానసౌధలో ఈ సమావేశం జరుగుతోందనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

# మోదీ సర్కార్ భద్రతా వైఫల్యమే పహల్గాం ఉగ్రదాడి

- మొదటి పేజీ తరువాయి

ఉగ్రదాడి ఎందుకు జరిగిందని ప్రశ్నించారు. భార్య చూస్తుండగానే భర్తను దారుణంగా చంపేశారు. ఉగ్రదాడిని ముందే గుర్తించేంత ఇంటెలిజెన్స్ వ్యవస్థ లేదా?..పహల్గాం ఉగ్రదాడి ఇంటెలిజెన్స్ వైఫల్యం అవునా కాదా? అని మోదీ సర్కార్ ను నిలదీశారు. గెలుపైనా ఓటమైనా బాధ్యత తీసుకోవడం గొప్పతనం.. కేంద్రం బాధ్యతతీసుకోకుండా TRF పై తోసేసిందన్నారు ప్రియాంకగాంధీ.

అధికార పార్టీకి జనంపై ధ్యాస లేదు. అన్ని రాజకీయాలే చేస్తోందన్నారు ప్రియాంకగాంధీ. దేశంలో చెలరేగిన హింసాకాండను,అల్లర్లను కట్టడి చేయడంతో హోంమంత్రి అమిత్ షా పూర్తిగా విఫలమయ్యారన్నారు.మణిపూర్, ఢిల్లీతో సహా దేశంలో అల్లర్లను కట్టడి చేయడంతో హోంమంత్రి విఫలమయ్యారని విమర్శించారు. యుద్ధాన్ని ఆపాలని అమెరికా అధ్యక్షుడు ఎలా చెప్తారు..పాక్ ఆర్మీ జనరల్ వైట్ హౌస్ లో ట్రంప్ తో లంచ్ మర్మమేంటనని కేంద్రాన్ని నిలదీశారు ప్రియాంకగాంధీ. పహల్గాం ఉగ్రదాడి బాధితుల తరపున నేను మాట్లాడుతున్నా..అధికార పార్టీకి ప్రజలపై ధ్యాస లేదు..అన్ని రాజకీయాలే చేస్తోంది. ఎన్డీయే పాలనలో పబ్లిసిటీ తప్పా .. పాలన లేదని.. మోదీ సర్కార్ ఎన్ని ఆపరేషన్లు చేసినా.. నిజాన్ని దాచలేదని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ తీవ్రంగా విమర్శించారు.

## ఉగ్రవాదుల మతం చూసి బాధపడొద్దు..

# అఖిలేశ్ యాదవ్ కు అమిత్ షా కౌంటర్

- మొదటి పేజీ తరువాయి

చర్చలో హోంమంత్రి అమిత్ షా ఈ రోజు మాట్లాడారు. పహల్గామ్ ఉగ్రవాదులను తుదముట్టించేందుకు 'ఆపరేషన్ మహదేవ్' చేపట్టినట్లు వివరించారు.

ఈ నెల 22న ఉగ్రవాదుల ఆచూకీ తెలిసిందని, దాచిగామ్ సమీపంలోని మహదేవ్ కొండల్లో ఉగ్రవాదులు దాక్కున్నట్లు గుర్తించామని చెప్పారు. దీంతో మహదేవ్ కొండల్లో గాలింపు చర్యలు చేపట్టి పహల్గామ్ ఉగ్రదాడి సూత్రధారి సులేమాన్ షా తో పాటు ముగ్గురు ఉగ్రవాదులను మన బలగాలు హతమార్చాయని వివరించారు. ఈ క్రమంలోనే తన ప్రసంగానికి పదే పదే అడ్డువస్తున్న ప్రతిపక్ష ఎంపీలకు అమిత్ షా చురకలంటించారు. సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ను ఉద్దేశించి.. 'ఉగ్రవాదుల మతం చూసి బాధపడొద్దు' అంటూ కౌంటర్ ఇచ్చారు. పాకిస్థాన్ ను వెనకేసుకు వస్తే మీకు ఏమొస్తుందంటూ ప్రతిపక్ష ఎంపీలను నిలదీశారు. పాకిస్థాన్ తో మీరు చర్చలు జరుపుతారా అని నిలదీశారు. కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం ఇటీవలి వ్యాఖ్యలను గుర్తుచేస్తూ.. పాక్ ను రక్షిస్తే మీకు ఏమొస్తుందని ప్రశ్నించారు. ఉగ్రవాదులు పాకిస్థాన్ కు చెందిన వారేనని తాము వెల్లడిస్తే ఆధారమేంటని చిదంబరం ప్రశ్నిస్తున్నారని షా గుర్తుచేశారు. ఉగ్రవాదుల దగ్గర పాకిస్థాన్ లో తయారైన చాక్లెట్లు దొరికాయని షా తెలిపారు. ప్రతిపక్ష ఎంపీలు పాకిస్థాన్ ను ఎందుకు వెనకేసుకు వస్తున్నారని హోంమంత్రి నిలదీశారు.

పహల్గామ్ ఉగ్రవాదులను మట్టుబెడితే దేశ ప్రజలతో పాటు ప్రతిపక్ష నేతలూ హర్షం వ్యక్తం చేస్తారని తాము భావించినట్లు అమిత్ షా పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం ప్రతిపక్ష ఎంపీల ప్రశ్నలు, చర్చలో వారి ప్రవర్తన చూస్తుంటే ఉగ్రవాదులను తుదముట్టించడం వారికి ఎలాంటి సంతోషాన్ని కలిగించలేకపోయినట్లు తెలుస్తోందని అమిత్ షా ఆరోపించారు.

# ఏపీ అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామిగా ఉంటుందన్న మంత్రి టాన్సీ లెంగ్.. ధన్యవాదాలు తెలిపిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

సంసిద్ధతను వ్యక్తం చేయడమే కాకుండా.. గత ప్రభుత్వ విధానాలను ప్రస్తావిస్తూ ఎక్స్ వేదికగా సింగపూర్ మంత్రి చేసిన ప్రకటన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఏపీ, అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యంగా ఉండేందుకు సిద్ధంగా ఉందని ఆ దేశ ట్రేడ్ ఇండస్ట్రీ శాఖలోని మానవ వనరులు, శాస్త్రసాంకేతిక మంత్రి టాన్సీ లెంగ్ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబుతో జరిగిన సమావేశంపై 'ఎక్స్' (ట్విట్టర్) హ్యాండిల్ లో పోస్టు చేసిన ఆయన ఏపీతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక ఇంధనం లాంటి రంగాలు పెట్టుబడులకు అనుకూలమని టాన్సీ లెంగ్ పేర్కొన్నారు. భారత్ లో అత్యంత వేగంగా ఎదుగుతున్న రాష్ట్రాల్లో ఒకటైన ఏపీలో ఫుడ్ ఎంపైర్, ఎవర్ వోల్ట్ లాంటి సింగపూర్ కంపెనీలు ఇప్పటికే పెట్టుబడులు, కార్యకలాపాల విస్తరణకు ఎదురుచూస్తున్నాయని తెలిపారు. అలాగే పోర్టులు, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పెట్టుబడులతో పాటు భాగస్వామ్యాలకు ఉన్న అవకాశాలపై సీఎం చంద్రబాబుతో చర్చించినట్టు మంత్రి టాన్సీ లెంగ్ స్పష్టం చేశారు. మరోవైపు 2014-2019లో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి నాటి ప్రభుత్వంతో కలిసి పనిచేశామని గుర్తు చేశారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పన, నిర్మాణ సహకారాన్ని అందించినట్టు తన ట్వీట్ లో పేర్కొన్నారు. అమరావతిలో స్టార్టప్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సింగపూర్ కంపెనీలు స్విస్ ఛాలెంజ్ విధానంలో టెండర్ కూడా దక్కించుకున్నాయని గుర్తు చేశారు.

అయితే, 2019లో ప్రభుత్వం మారిన తర్వాత ఈ సహకారం ఆగిపోయిందని అన్నారు. సింగపూర్ కన్సార్టియం కూడా అమరావతి ప్రాజెక్టు నుంచి బయటకు వచ్చేసిందని టాన్సీ లెంగ్ తన పోస్టులో పేర్కొన్నారు. మళ్లీ ఇప్పుడు చంద్రబాబుతో సమావేశమై ఏపీ అభివృద్ధిపై చర్చించినట్టు ఆయన వెల్లడించారు. సీడ్ క్యాపిటల్ విషయంలో సింగపూర్ కన్సార్టియం పనిచేయకున్నా.. ఏపీలో పట్టణాభివృద్ధి సహా వివిధ రంగాల్లో సాంకేతిక సహకారం అందించటంతో పాటు ప్రపంచబ్యాంకు లాంటి భాగస్వాములతో కలిసి ఏపీ అభివృద్ధి ప్రణాళికల్లో కలిసి పనిచేస్తామని టాన్సీ లెంగ్ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రుల బృందం సింగపూర్ పర్యటన ఫలప్రదం కావాలని కోరుకుంటున్నట్టు సింగపూర్ మంత్రి తన ట్వీట్‌లో రాసుకొచ్చారు.

ఏపీ అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం విలువైంది: సీఎం చంద్రబాబువివిధ అభివృద్ధి ప్రాజెక్టుల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధమన్న సింగపూర్ మంత్రి టాన్సీ లెంగ్ ప్రకటనకు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలియచేశారు. ఏపీ ప్రజల తరపున సింగపూర్ ప్రభుత్వానికి, ఆ దేశ మంత్రి టాన్సీ లెంగ్ కు 'ఎక్స్' వేదికగా సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ సుస్థిరాభివృద్ధి కోసం ఏపీ ప్రభుత్వంతో భాగస్వామిగా ఉండడానికి సింగపూర్ ప్రభుత్వం ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. వివిధ రంగాల్లో ఏపీ-సింగపూర్ కలిసి పనిచేయడానికి టాన్సీ లెంగ్ తో జరిపిన చర్చలు బాటలు వేశాయని సీఎం పేర్కొన్నారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఉత్పాదక రంగం, రెన్యూవబుల్ ఎనర్జీ, పోర్టులు, డిజిటల్, ఇన్నోవేషన్, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో కలిసి పనిచేసేందుకు ఈ చర్చలు దోహద పడతాయన్నారు. 90వ దశకం నుంచి సింగపూర్ ప్రభుత్వంతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఏపీ అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం చాలా విలువైందని సీఎం చంద్రబాబు తన ట్వీట్ లో పేర్కొన్నారు.

ఏపీ అభివృద్ధి ప్రయాణంలో.. ఆధునిక మౌలిక వసతుల కల్పనలో సింగపూర్ ప్రభుత్వం నుంచి సహకారం ఆశిస్తున్నామని స్పష్టం చేశారు. ఏపీలో అద్భుతమైన ప్రజా తీర్పుతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సంకల్పం తీసుకున్నామన్నారు. స్వర్ణాంధ్ర-2047 సాధన దిశగా అడుగులు వేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. వివిధ రంగాల్లో సింగపూర్ దేశ విధానాలు ఎప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని అన్నారు. పట్టణ, గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వేసుకున్న ప్రణాళికలకు సింగపూర్ తోడైతే ప్రజల ఆశలను నెరవేర్చగలమని సీఎం చంద్రబాబు తన ట్వీట్ లో ఆకాంక్షించారు.

# పిన్నెల్లి ప్రధాన అనుచరుడు తురకా కిశోర్ కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

- మొదటి పేజీ తరువాయి

నిరాకరించింది. తనపై ఇక మీదట ఎలాంటి ఎఫ్ఐఆర్ లు నమోదు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కిశోర్ రిట్ పిటిషన్ దాఖలు చేశాడు. ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చాక తనపై 9 కేసులు నమోదు చేశారని, ఇంకా మరికొన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేయనున్నారని కిశోర్ తన పిటిషన్ లో పేర్కొన్నాడు. అయితే, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం అతడి పిటిషన్ ను డిస్మిస్ చేసింది. మాచర్ల మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిశోర్ గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలపై దాడికి పాల్పడిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో కనిపించాయి. అతడిపై అనేక ఆరోపణలతో కేసులు నమోదయ్యాయి. వాటిలో మూడు హత్యాయత్నం కేసులు కూడా ఉన్నాయి. ఎన్నికల ఘటనల నేపథ్యంలో, పిన్నెల్లి బ్రదర్స్ అజ్ఞాతంలోకి వెళ్లగా, వారి అనుచరులు కూడా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో, మల్కాజిగిరి జైపురి కాలనీలో తురకా కిశోర్ ను పోలీసులు ఈ ఏడాది జనవరిలో అరెస్ట్ చేశారు.



# మందులోళ్ళ మాయ..!

**మెడికల్ షాపులలో వైద్యశాలలను మించిన మాయాజాలం**

**అధిక ధరలతో నిలువు దోపిడీ**

**శాంపిల్స్, జనరిక్ మందుల విక్రయాలు**

**సాధారణ ప్రజలకు మెడికల్ షాపులే ఆధారం**

**భారీగా లాభాలు అర్జిస్తున్న మందుల షాపుల యజమానులు**

**ప్రేక్షక పాత్రలో ఔషధ నియంత్రణ శాఖ**



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ జూలై 29**

మార్కాపురంలో మెడికల్ షాపులపై నియంత్రణ కొరవడింది. తక్కువ ధరకే దొరికే జనరిక్ మందులను అధిక ధరకు విక్రయిస్తూ సామాన్యులను దోచుకుంటున్నారు. జ్వరం వచ్చిందనో.. జలుబు చేసిందనో డాక్టర్ దగ్గరకు వెళ్తే.. వంద నుంచి 500 వరకు ఫీజు చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశంతో పేదలు నేరుగా మెడికల్ షాపులకు వెళుతుండగా, ఇదే అదనుగా షాపు యజమానులు దండుకుంటున్నారు. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**నిఘా కరువు...**

ఏజెన్సీలతోపాలు, మెడికల్ దుకాణాలపై ఔషధ నియంత్రణ విభాగం నిఘా పూర్తిగా కొరవడింది. మార్కాపురంలో ఎన్ని షాపులకు అనుమతి ఉంది? నిబంధనలు అతిక్రమిస్తూ మందులు ఎవరు విక్రయిస్తున్నారనే విషయంపై తనిఖీలు ఉండడం లేదు. దీంతో మందుల షాపుల యజమానులు జనరిక్ మందులు ఇచ్చి బ్రాండెడ్ మందుల ముసుగులో దోపిడీ చేస్తున్నారు.

**నిబంధనలు గాలికి..**

వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించవద్దనే నిబంధనను మెడికల్ షాపుల యజమానులు తుంగలో తొకుతున్నారు. మెడికల్ షాపు నిర్వహించే ఫార్మసిస్టు డ్రెస్ కోడ్‌తోపాటు మందులు అందించే సమయంలో గ్లౌజులు వేసుకోవాలి. కొన్ని మందులను ఫ్రిజ్‌లో మాత్రమే భద్రపరచాలి. వినియోగదారుడికి కచ్చితంగా మందుల వివరాలతో కూడిన బిల్లు ఇవ్వాలి. కానీ, ఏదో ఒకటి, రెండు షాపుల్లో తప్ప మిగతా దుకాణాల్లో ఇది అమలు కావడం లేదు. మెడికల్ దుకాణాల యజమానుల యూనియన్ కనుసన్నల్లో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు నడుస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**మందుల షాపుల వ్యాపార ధోరణి చూస్తే వైద్యశాలను తలపిస్తున్నాయి. వైద్యరంగం కేవలం వ్యాపార ధోరణికి పరిమితమైన ప్రస్తుత వైద్య వ్యవస్థలో మందుల షాపుల పై కూడా ఈ నీలి నీడలు ప్రభావం పడి అదే ధోరణిలో ప్రయాణిస్తున్నాయి. కొన్ని మెడికల్ షాపులలో శాంపిల్, జనరిక్ మందులు విక్రయాలు కొనసాగుతున్నాయని ఆరోపణలు వినబడుతున్నాయి. అయినా ఔషధ నియంత్రణ శాఖ వారిపై చర్యలు తీసుకొనే విషయంలో ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయి. ఈ శాఖపై అవినీతి ప్రభావం కూడా ఎక్కువై మందుల షాపులపై నియంత్రణకు దూరమైంది. దీంతో వారి ఆగడాలు అంతులేకుండా పోయింది.**

**కమీషన్ మాయాజాలం...**

మందుల విక్రయం పెద్ద వ్యాపారంగా మారింది. తమ కంపెనీకి చెందిన లక్ష విలువ చేసే మందులు సేల్ చేస్తే అందులో 40 శాతం కమీషన్ ఇస్తామని నిర్వాహకులు వైద్యులతో ఒప్పందాలు చేసుకుంటున్నటు తెలుస్తున్నది. దీంతో వైద్యులు ఆ కంపెనీ మందులు సేల్ చేసేందుకు అవసరం ఉన్నా లేకున్నా రోగుల నెత్తిన రుద్దుతున్నారు. అయితే, మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో జనరిక్ మందుల షాపులు ఏర్పాటు చేయని కారణంగా రోగులు, పేదలు తీవ్రంగా నష్టపోతున్నారు.

**తనిఖీలు చేస్తున్నాం..**

**డ్రగ్ ఇనస్పెక్టర్ ఉషారాణి**

మెడికల్ షాపులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. నిబంధనలు పాటించని వాటిపై చర్యలు తీసుకుంటాం. మందుల విక్రయాలకు సంబంధించి బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి. కాలంచెల్లిన మందులు, శాంపిల్స్ విక్రయిస్తున్నా, రికార్డులు సక్రమంగా లేకపోయినా చర్యలు తప్పవు. అనుమతులు కూడా రద్దు చేస్తాం.

పెన్ పవర్ ప్రకాశం


# విద్యుత్ పరికరాల రవాణ బిల్లులకు ప్రతి పాదనలు

**విద్యుత్ రవాణా పేరిట 70 లక్షల బిల్లు స్వాహా చేసేందుకు కుట్ర**

**రెండున్నర నెలల క్రితమే రూ.24 లక్షల బిల్లు మార్చినట్లు సమాచారం.**

**అసలు ఎస్సీ ఎస్టీ కాలనీల్లో ఎలాంటి పనులు జరగలేదన్న ఆరోపణలు.**

**ప్రభుత్వం 'సైట్ ఓపెన్' చేయడాన్ని దుర్వినియోగం చేసిన కాంట్రాక్టర్.**




**పుల్లలచెరువు పెన్ పవర్ జూలై 29**

యర్రగొండపాలెం నియోజకవర్గంలో 2014%--%2019 కాలంలో విద్యుత్ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల పేరుతో భారీ అవినీతి చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. మొత్తం 70 లక్షల రూపాయల బిల్లును అక్రమంగా కాజేసేందుకు ఒక కాంట్రాక్టర్ పన్నాగం పన్నుతున్నట్టు విశ్వసనీయ సమాచారం.గత టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలలో విద్యుత్ పనులు చేశామంటూ నకిలీ పత్రాలు చూపించి, ఇటీవలే 24 లక్షల బిల్లు పొందినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అసలు ఆ కాలనీల్లో పనులు జరగకపోయినా కూడా బిల్లులు మార్చుకొని ప్రభుత్వ నిధులు కాజేసినట్లు కూటమి నాయకుల నుండీ ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ పెద్దల సహకారంతోనే ఈ కాంట్రాక్టర్ ఇంత దూరం వెళ్లగలిగాడన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పని చేసిన కార్యకర్త నష్టపోకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వంవెబ్ సైట్ ఓపెన్ చేయగా, అదే అవకాశంగా మలుచుకున్న కాంట్రాక్టర్, చేయని పనులకు సంబంధించిన నకిలీ నివేదికలు సమర్పించి బిల్లులు మంజూరయ్యేలా కుట్రలు పన్నుతున్నాడునీ పలువురు నాయకులు అంటున్నారు.పర్యవేక్షణ లేకుండా, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి అవకతవకలకు అవకాశం ఏర్పడుతోందని స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.అవినీతి చర్యలను అడ్డుకోవడానికి సంబంధిత శాఖలు వెంటనే రంగంలోకి దిగాలని, బిల్లులు ఆమోదించే ముందు సైట్ ఇన్‌స్పెక్షన్లు, అధికారిక ఆధారాలు నిర్ధారించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనాన్ని దోచుకునే ఈ చర్యలను ఖండిస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఆర్థికంగా బలంగాఎదిగారో, వారు అట్టడుగున ఉన్నబడుగు వర్గాలకు సహాయం అందించాలి

**అప్పుడే అసమానతలు తొలగి సమాజంలో సమానత్వం నెల కొంటుంది**

**ప్రతీఒక్కరూ వెల్తీ, హెల్దీ, హ్యాపీ ల పౌరులుగా జీవించగలుగుతారు**

**జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా**











**గిద్దలూరు పెన్ పవర్ జులై 29**

2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేని సమాజ మే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పి 4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. పి-4(పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్ షిప్) కార్యక్రమం పై అధికారులకు, గ్రామసచివాలయ సిబ్బందికి మార్గదర్శకులకు, అవగాహన కల్పించేందుకు గిద్దలూరు లోని శ్రీ సీతా రామ కల్యాణ మండలంలో మంగళవారం ఏర్పాటు చేసిన గిద్దలూరు నియోజక వర్గం అవగాహన సదస్సు లో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, స్థానిక శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, పేదరికం లేని సమాజమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పి 4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఈ పీ 4 కార్యక్రమం లక్ష్యం సమాజంలో ఎవరైతే బాగా ఆర్థికంగా బలంగా ఎదిగారో, వారు అట్టడుగున ఉన్న బడుగు వర్గాలకు సహాయం అందిస్తే అసమానతలు తొలగుతాయని, సమాజంలో సమానత్వం నెలకుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ వెల్త్, హెల్దీ, హ్యాపీ ల పౌరులుగా జీవించగలుగుతారన్నారు. ఈ ఉద్దేశంతో ప్రభుత్వం ఒక సర్వే నిర్వహించి ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాల్సిన కుటుంబాలను బంగారు కుటుంబాలుగా, సామర్థ్యం ఉన్నవారిని మార్గదర్శకులుగా గుర్తించి నమోదు చేయడం జరుగుచున్నదన్నారు. ఈ పథకం కింద జిల్లాలో 74,911 బంగారు కుటుంబాలను గుర్తించగా, ఇప్పటి వరకు 34 వేల బంగారు కుటుంబాలను దత్తతు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ పథకం పూర్తిగా వాలంటరీ, అంటే స్వచ్ఛందమే నని, ఎవరూ ఎవరినీ బలవంతంగా ఇందులో చేర్చడం లేదని పేర్కొన్నారు. అలాగే పీ4 పథకంలో పాల్గొంటున్న అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సిబ్బంది కూడా దీన్ని స్వచ్ఛంద కార్యక్రమంగానే చూడాలని ఎటువంటి బలవంతం లేకుండా పని చేయాలని ఆదేశించారు . క్షేత్ర స్థాయిలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి స్థానికంగా నీడ్ అసెస్మెంట్ సర్వే పక్కాగా చేపట్టడంతో పాటు ఈ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాలను చేపట్టి మార్గదర్శకులను గుర్తించి బంగారు కుటుంబాలతో అనుసంధానం చేపట్టాలన్నారు. రానున్న రోజుల్లో ఈ కార్యక్రమం దేశంలోని ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకం అయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ, గడిచిన సంవత్సర కాలంగా ప్రధాన మంత్రి సహకారంతో సుపరిపాలన అందించడమే లక్ష్యం గా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారన్నారు. కేవలం సంక్షేమం, అభివృద్ధి చేసినంత మాత్రానే సమాజం ముందుకు పోదని, పేదరిక నిర్మూలనతో పాటు ఆర్థిక అసమానతలు లేని సమాజమే ఏర్పడినప్పుడే రాష్ట్రం అన్నీ రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పి 4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. సమాజంలో ఆర్థికం గా వృద్ధి చెందిన వ్యక్తులు, సామాజిక పరంగా అట్టడుగు స్థానంలో ఉన్న కుటుంబాలను గుర్తించి సహాయ సహకారాలు అందించి ఆ కుటుంబాలను వృద్ధిలోకి తేవడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ నియోజక వర్గం వెనుకబడిన ప్రాంతమైనప్పటికినీ, ఇటువంటి కార్యక్రమాల్లో ముందుంటున్నారు. నియోజక వర్గంలో 10,879 బంగారు కుటుంబాలను గుర్తించగా, ఇప్పటివరకు 5,868 కుటుంబాలను దత్తతు తీసుకోవడం జరిగిందని, ఇంకా 5,011 కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉందన్నారు. నియోజక వర్గంలో గుర్తించిన బంగారు కుటుంబాలను దత్తతు తీసుకోవడంలో , మార్గదర్శకులను గుర్తించడంలో తన వంతు సహకారం అందించడం జరుగుతుందన్నారు. తొలుత జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి పి 4 కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాన్ని, లక్ష్యాన్ని వివరించగా, పలువురు మార్గదర్శకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ వెంకట సుబ్బయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలయ్య, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, ఎస్డిసి సీతారామిరెడ్డి, ఐ సి డి ఎస్ పిడి సువర్ణ, నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన మండల అధికారులు, సచివాలయం సిబ్బంది, ఎంపిక చేసిన మార్గదర్శకులు తదితరులు పాల్గొన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, గిద్దలూరు లోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల సదనం ను సందర్శించి మౌలిక సదుపాయాలు, వసతులను పరిశీలించి, వివరాలను అడిగితెలుసుకున్నారు. ఈ భవనం చాలా పాతబడి పోయిందని, మరమత్తులు లేదా కొత్త భవనం నిర్మించాల్సిన అవసరం ఉందని బాల సదనం అధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ శ్రీ సహదీత్ వెంకట త్రివినాగ్, ఐసిడిఎస్ పిడి సువర్ణ, బాలసదనం అధికారి ఝాన్సీ , తహసిల్దార్ ఆంజనేయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బేస్తవారిపేటలో సర్వీస్ రోడ్డును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సరియా





**బేస్తవారిపేట, పెన్ పవర్ జూలై 29:**
అనంతపురం – అమరావతి స్టేట్ హైవే రోడ్ 544డి లోని బేస్తవారిపేట పట్టణంలో జాతీయ రహదారి వెంట అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్లను;ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సరియా;మంగళ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సర్వీస్ రోడ్డు వెంట ఉన్న షాపులు యజమానులు వినతి పత్రం అందజేశారు. షాపు యజమానులు గతంలో 30 మీటర్లుగా రోడ్డు నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చారని, 25 మీటర్లు రోడ్డు తీసుకోవాలని; విజ్ఞప్తి చేశామన్నారు. నేషనల్ హైవే అధికారులు స్థానిక షాపుల యజమానుల అభిప్రాయాలు తీసుకోకుండా వాళ్ళు ఇష్టానుసారంగా రోడ్డు నిర్మాణం చేపట్టారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.అనంతరం పాత ఎఫ్ఎంబి ప్రకారం సర్వే చేసి మార్కింగ్ ఇవ్వాలని, ఈ మార్కింగ్ ప్రకారం షాపుల స్థలాలు ఎంతవరకు పోతున్నాయి. స్థానిక ప్రజలు బెస్తవారిపేట పట్టణంలో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయడం వలన దాదాపు 400 ఇండ్ల యజమానులు,షాపులు దెబ్బతినే అవకాశం ఉందని సర్వీస్ రోడ్డు నిలుపుదల చేసి బేస్తవారిపేట వెలుపల బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. అలాగే స్థానిక ప్రయాణికులు మండల కేంద్రమైన బేస్తవారిపేటలో ఆర్టీసీ బస్టాండ్ లేకపోవడంతో మహిళ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ వెంట మార్కాపురం సబ్ కలెక్టర్, బెస్తవారిపేట తాసిల్దార్ జితేంద్ర కుమార్, స్థానిక విఆర్వోలు, మండల సర్వేయర్, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఎమ్ ఈ ఓ బలరాం రెడ్డికి సతీ వియోగం

**నివాళులు అర్పించిన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల**





**గిద్దలూరు పెన్ పవర్ జులై 29**
గిద్దలూరు పట్టణంలోని పాండురంగారెడ్డి నగర్ నివాసం ఉంటున్న రిటైర్డ్ ఎంఇఓ దప్పిలి బలరాం రెడ్డికి సతీ వియోగం కలిగింది . బలరాంరెడ్డి సతీమణి సుబ్బలక్షమ్మ సోమవారం రాత్రి 9 30 గంటల సమయం లో బాత్ రూంకు వెళ్లి ఒక్కసారిగా కుప్పకూలి పోయారు. స్వర్గస్తురాలైన దప్పిలి సుబ్బలక్ష్మమ్మ మృతి పట్ల గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు సంపూర్ణ ఆరోగ్యం గా ఉన్న సుబ్బలక్షమమ్మ ఆకస్మిక మరణం విచారం కలిగిచిదని ,అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ఆమె మృతి సమాచారం తెలుసుకొని మంగళవారం నాడు వారి స్వగృహానికి వెళ్లి సుబ్బలక్షమమ్మ భౌతికకాయం పై పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. భర్త బలరాం రెడ్డి ని, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారితో పాటు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, సొసైటీ బ్యాంకు చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, పట్టణ కౌన్సిలర్ లోక్కు రమేష్, మండ్ల శ్రీను, జిల్లెల్ల సంపత్ రెడ్డి నివాళులు అర్పించారు. కాకుండా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు సుబ్బలక్షమమ్మ భౌతికాయం పై పుష్పగుచ్ఛలుంచి నివాలర్పించారు. వీధిలోని ప్రముఖులు, మహిళలు దప్పిలి సుబ్బలక్షమమ్మ పార్థివ దేహాన్ని సందర్శించి నివాలర్పించారు.

## నేడే మున్సిపాలిటి కౌన్సిల్ సమావేశం

**కమీషనర్ రమణ బాబు**

**గిద్దలూరు పెన్ పవర్ జులై 29**



గిద్దలూరు పురపాలక సంఘం పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం బుధవారము ఉదయం 11:00 గంటలకు పాముల వెంకటసుబ్బయ్య చైర్మన్ అధ్యక్షతన జరుపనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశము ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొనున్నట్లు తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు , మున్సిపాల్టీలో ని అధికారులు , పాత్రికేయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ఖరీఫ్ సీజన్ పంటలపై యజమాన పద్ధతుల శిక్షణా కార్యక్రమం

**మండల వ్యవసాయాధికారి పి మధుబాబు**





**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 29**
మండలంలోని రేగులచెలక గ్రామంలో మంగళవారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన 2025 క్రింద ఖరీఫ్ సీజన్ నందు సాగు చేసే పంటలలో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాదికారి పి.మధుబాబు మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో అమలులో ఉన్న పథకాలు అయిన అన్నదాత సుఖీభవ – పి యం కిసాన్, భూసార పరీక్షలు, వ్యవసాయ యంత్రీకరణ,పచ్చి రొట్ట విత్తనాలు సరఫరా మొదలైన అంశాల గురించి రైతులకు వివరించారు.జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయధికారి ఎ. శైలజ మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం, వరి, కంది,మినుము,సజ్జ, మొక్కజొన్న, మిరప పంటలలో విత్తనం వేసే దగ్గర నుండి పంట కోత వరకు చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి, జీవన ఎరువుల ప్రాముఖ్యత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పి. శ్రీనివాసులు , గ్రామ వ్యవసాయ సహాయకులు వి. చిరంజీవి, ఎం. వెంకటేశ్వర్లు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు**





**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 29**
రాష్ట్రంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మండల టిడిపి అధ్యక్షుడు డాక్టర్ బొమ్మన బోయిన వెంకటేశ్వర్లు అన్నారు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని ఆర్ కె పల్లి, చింతపూడి గ్రామపంచాయతీలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వం చేపట్టిన పథకాలపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలాంటి అవినీతికి తావు లేకుండా బడికి వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలో తల్లికి వందనం పథకం, దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్ నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారని గుర్తు చేశారు త్వరలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని , మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తారని, రాష్ట్రంలో సామాజిక న్యాయం పాటిస్తూ సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, మండల టిడిపి నాయకులు ఎన్.సి. మాలకొండయ్య, గుంటిమడుగు శ్రీనివాస వర్మ,చావా సుబ్బయ్య , గ్రామ పార్టీ అధ్యక్షుడు చావా జయరాములు, క్లస్టర్ ఇన్చార్జిలు షేక్ రజ్జాబ్ బాషా , కోనంగి వెంకట కొండయ్య, యూనిట్ ఇన్చార్జిలు బత్తుల వెంకటాద్రి, చావా చంద్రశేఖర్, కామనబోయిన వెంకటస్వామి, డి నాగరాజు, పసుపులేటి గురుకృష్ణ, ఎడవల్లి సుబ్బయ్య, జి శ్రీనివాసరాజు, బోయిన మాలకొండయ్య, పోకల మాల్యాద్రి, రాయని వెంకటేశ్వర్లు, బండారు వెంకటరామయ్య, హస్తి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగష్టు 4న గిద్దలూరు, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం

**గిద్దలూరులోని మార్కెట్ ఆవరణ లో వేదిక**



**గిద్దలూరు పెన్ పవర్ జులై 29**
గిద్దలూరు, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ లుగా బైలడుగు బాలయ్య, పూనూరు భూపాల్ రెడ్డి ఆగస్టు 4వ తేదీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు ఈ నేపథ్యంలో గిద్దలూరు మార్కెట్ యార్డ్ ప్రాంగణాన్ని సభ ఏర్పాట్ల కోసం మార్కెట్ యార్డు ఆవరణలో సభా వేదిక ఏర్పాటు చేయ నున్నారు. అయితే ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఈసభా వేదిక ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా రానున్నారని తెలుస్తుంది . ప్రమాణ స్వీకారం కార్యక్రమం అట్ట హాసంగా నిర్వహించాలని ఎమ్మెల్యే అశోకరెడ్డి భావిస్తున్నట్లు, తెలుస్తుంది.

## ఇసుక లారీ బోల్తా - తప్పిన ప్రమాదం



**పుల్లల చెరువు పెన్ పవర్ జూలై 29**
పుల్లల చెరువు మండలంలోని ముటుకుల పంచాయితీ సింగుపల్లి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఇసుక లారీ బోల్తా పడిన ఘటన కలకలం రేపింది. గుంటూరు జిల్లా నుంచి అధిక లోడుతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీ, డంపింగ్ ప్రదేశానికి చేరుకునే సమయంలో అదుపుతప్పి బోల్తా పడింది.అదృష్టవశాత్తు ఘటన సమయంలో ఎవ్వరూ అక్కడ లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్, క్లీనర్ ఇద్దరూ సురక్షితంగా బయటపడ్డారు. అయితే ఈ ఘటన మరోసారి ఇసుక మాఫియా బలాన్ని, పాలక వ్యవస్థల వైఫల్యాన్ని బహిర్గతం చేసింది.ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అవినీతిపై నిర్భయంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చినా, ఇసుక అక్రమ రవాణా, మాఫియా ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. అధికార యంత్రాంగం మౌనం వహించటంతో, పర్యావరణం దెబ్బతినడమే కాక, ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇసుక మాఫియా అరాచకాలను నియంత్రిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కొత్త కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక కూడా అదే పాత చక్రంలో తిరుగుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు.ఇది ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనం. డంపింగ్ పేరుతో లక్షల టన్నుల ఇసుక అక్రమంగా తరలిపోతుంటే, పంచాయతీ సిబ్బంది నుంచి పోలీసుల వరకూ ఎందుకీ మౌనం? అంటూ స్థానికులు మండిపడుతున్నారు.కూటమి పాలనపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి, ఇలాంటి ఘటనల ద్వారా మరింత ముదురుతోంది. అధికారులు తక్షణమే స్పందించి ఘటనపై దర్యాప్తు జరిపించాలని, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధికి గట్టి కృషి

**పొదిలి మునిసిపల్ కమిషనర్ నారాయణరెడ్డి**



**పొదిలి, పెన్ పవర్, జూలై 29**
రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధి కోసం గట్టి కృషి చేస్తుందని వదిలి నగర పంచాయతీ కమిషనర్ కేఎల్ నారాయణరెడ్డి చెప్పారు మంగళవారం నాడు స్థానిక విశ్వనాధపురం లోని జూనియర్ కళాశాల రోడ్డులో ప్రభుత్వం నిర్వహిస్తున్న మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు ఈ సందర్భంగా కమిషనర్ నారాయణరెడ్డి ఆ కేంద్రంలో మహిళలకు కుట్టు శిక్షణలో ఇస్తున్న తర్ఫీదును పరిశీలించి, శిక్షకురాలు అయిన వీరిశెట్టి రాజ్యలక్ష్మిని అభినందించారు ఇటువంటి స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాల ద్వారా మహిళలు తమ స్వశక్తితో జీవనం సాగించే అవకాశాలు మెండుగా ఉంటాయని కమిషనర్ నారాయణరెడ్డి చెప్పారు ప్రభుత్వం కల్పిస్తున్న ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను లబ్ధిదారులు సద్వినియోగపరచుకోవడం ద్వారా ఆర్థికంగా ముందుకు సాగాలని కమిషనర్ నారాయణరెడ్డి సూచించారు.

## పెద్ద నాగులవరం, నికరంపల్లి గ్రామంలో పొలం పిలుస్తుంది

**రెండు రోజుల్లో ముగియనున్న పంటల బీమా పథకం -వ్యవసాయ శాఖ అధికారిని బుజ్జి బాయ్**

**మార్కాపురం టౌన్ పెన్ పవర్ జులై 29**
మండలంలో ని పెద్ద నాగులవరం, నికరంపల్లి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారిని బుజ్జి బాయ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పంట వేసిన ప్రతి రైతు ఈ పంట నమోదు గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు కలిసి ఈ పంట నమోదు ప్రక్రియ చేయించుకోవాలన్నారు. ఈ పంట నమోదు చేసుకోవడం వలన ప్రకృతి వైపరీత్యాల వలన కలిగేటువంటి పంట నష్టపరిహారము వేసినటువంటి పంటను మద్దతు ధరకి అమ్ముకోవడానికి, పంటల బీమా వర్తిస్తుందని తెలిపారు. కౌలుకు వేసుకునేటువంటి ప్రతి కౌలు రైతు కూడా ఈ పంట నమోదు చేయించుకోవలని సూచించారు. పంట సాగు చేసిన ప్రతి రైతు పంటల బీమా పథకం కింద మీ పేరును నమోదు చేసుకోగలరని తెలియజేశారు . వరి 860, కంది 430, ఎండుమిరప 4500, మినుములు 205 ఎకరానికి ప్రీమియం మన సిఎస్సి సెంటర్లో నమోదు చేయించుకోవాలని, పంటల బీమా రెండు రోజుల్లో ముగియనున్నట్లు తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకుల దగ్గర సోయింగ్ సర్టిఫికేట్ తీసుకొని ఇన్సూరెన్స్ కట్టవలెనని తెలిపారు . అన్నదాత సుఖీభవ పథకం కింద ఎన్పీసీఐ ఇన్ ఆక్టివ్ మరియు లింకు కాని రైతులు వారి యొక్క రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి ఎన్పీసీఐ లింకుచేయించుకోవాలని సూచించారు. ఈ పంట నమోదు ప్రక్రియలో మార్కాపురం ఏవో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద నాగులవరం వి ఏ ఏ ప్రభు, నికరంపల్లి వి ఏ ఏ రాజశేఖర్ రెడ్డి , అనిమల్ హస్బెండరీ ఉద్యోగులు ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.






## తిరుమల వెంకటేశ్వర స్వామి సన్నిధిలో అనిల్ కుమార్ దంపతులు



**పొదిలి, పెన్ పవర్, జూలై 29**
తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి ని మంగళవారం నాడు రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్, సురేఖ దంపతులు దర్శించుకున్నారు ఈ సందర్భంగా అనిల్ కుమార్ దంపతులు స్వామివారి సుప్రభాత సేవలో పాల్గొని తమ భక్తి ప్రవక్తులను చాటుకున్నారు. అనంతరం అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకున్నామని చెప్పారు అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ తో పాటు తెలుగుదేశం పార్టీలోని మంత్రులతో సహా వివిధ స్థాయి నాయకులతోపాటు మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి , ఆయన కుటుంబ సభ్యులు నిండు నూరేళ్లు సకల సంతోషాలతో వర్ధిల్లాలని కలియుగ ప్రత్యక్ష దైవమైన వెంకటేశ్వర స్వామిని వేడుకున్నామని చెప్పారు.

# కుంటలతో రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

కలెక్టర్. తమీమ్ అన్సారియా.
ఉపాధి కూలీపై ఆరా.
చేస్తున్న పనులకు గిట్టుబాటు కావడం లేదని కూలీల విజ్ఞప్తి.
కుంటల వద్ద మొక్కలు నాటిన కలెక్టర్.
ఉపాధి హామీ పథకంలో ఎలాంటి పొరపాట్లను జరగనివ్వద్దు.









**పెన్ పవర్, కంభం జూలై 29**

రైతు వారీ నీటి కుంటలతో రైతులు మెరుగైన ఆదాయ వనరులను పెంపొందించుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఏ .తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. మంగళవారం కంభం మండలం, కందులాపురం కంభం పంచాయతీ పరిధిలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన రైతు వారీ నీటి కుంటలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కందులాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రైతులు అన్నా మురళి అన్నా ప్రసాద్ లకు చెందిన పొలంలో నిర్మించిన రైతు వారీ నీటి కుంటలను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాజిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. రైతుతో మాట్లాడి సాగు చేస్తున్న పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, అధికారులతో కలిసి మొక్కను నాటారు. పనిచేసిన కాలానికి వారానికి ఎంత నగదు పడుతుందని కలెక్టర్, ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వివరాలు అడిగితెలుసుకున్నారు. కొంతమంది కూలీలు నగదు పడటం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, మండలంలో ఎంతమంది ఉపాధి హామీ కూలీలు ఉన్నారు, వారిలో ఎంతమంది ఎంత పనిచేశారు, పనిచేసిన కాలానికి ఎంత వరకు నగదు జమ అయింది అని కలెక్టర్ డ్వామా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంభం పంచాయతీ పరిధిలో వెంకటేశ్వర రెడ్డి పొలంలో చేపట్టిన రైతు వారీ నీటి కుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షపు నీరు వృథాగా పోకుండా భూమిలోకి ఇంకించేందుకు నీటి కుంటలు ఉపయోగ పడతాయన్నారు. ప్రధానంగా నీటి కుంటలతో రైతులు మెరుగైన ఆదాయ వనరులను పెంపొందించు కోవచ్చన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1075 రైతు వారీ నీటి కుంటల నిర్మాణాలు పూర్తి చేయడం జరుగుతుందని, మరో 800 నీటి కుంటలు పురోగతి లో ఉన్నాయని తెలిపారు. కంభం మండలంలో 140 నీటి కుంటలకు గాను 50 నీటి కుంటలు పూర్తి కాగా మరో 78 నీటి కుంటల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయన్నారు. పశ్చిమ ప్రకాశం లో రైతు వారీ నీటి కుంటల నిర్మాణం ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని, రైతులకు బహుళ ఆదాయాన్ని అందించే నీటి కుంటలను జిల్లాలో ప్రతి రైతు విధిగా ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, డ్వామా పీడీ జోసెఫ్ కుమార్ తహసీల్దార్ కిరణ్, ఎపిడి భాస్కర్ రావు, ఏపీవో జీవరత్నం ఏపీ డి భాస్కర్ రావు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కారు ప్రమాదంలో మోక్షగుండం హెచ్ఈఓ మృతి




బేస్తవారిపేట, పెన్ పవర్ జులై 29:

అమరావతి - అనంతపురం హైవే రోడ్డు లోని మోక్షగుండం ఆరోగ్య కేంద్రం సమీపంలో రోడ్డు ప్రమాదం మంగళవారం ఉదయం జరిగింది.మోటార్ సైకిల్ వెళ్తున్న నాగేశ్వరరావును బేస్తవారిపేట నుండి గిద్దలూరు వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోక్షగుండం పిహెచ్సి లో హెచ్ఈఓ గా పనిచేస్తున్న సగునాల నాగేశ్వరరావు(56) బలమైన గాయాలు కావడంతో ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108కి సమాచారం అందించారుకారు. 108 సిబ్బంది బాధితులని వైద్య చికిత్సల నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడ్డ వ్యక్తిని పరిశీలించిన వైద్యులు అప్పటికే నాగేశ్వరరావు మృతి చెందినట్లు తెలిపారు. ఈ ప్రమాదంపై బేస్తవారిపేట ఎస్ఐ రవీంద్రారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్ర బిజెపి అధ్యక్షులు జిల్లా పర్యటన విజయవంతం చేయాలి

**బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టరు జె వి నారాయణ**



**గిద్దలూరు పెన్ పవర్ జులై 29**

గిద్దలూరు అసెంబ్లీ గిద్దలూరు పట్టణము లో జిల్లా జనరల్ సెక్రటరీ జె వి నారాయణ ఆధ్వర్యం లో ఆగస్టు 7 న రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ జిల్లా పర్యటనకు వస్తున్న సంధర్భంగా కార్యాచరణ సమావేశం జరిగింది. ఈ సమావేశం లో. రాష్ట్ర అధ్యక్షులు పర్యటన కు నాయకులు కార్యకర్తలు అందరూ తప్పకుండా హాజరు అయి ఈ కార్య క్రమం విజయ వంతం చేయాలని సూచించారు . ఈ కార్య క్రమం లో పట్టణ బీజేపీ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్,భవ నాసి వెంకట రామాంజనేయులు, జిల్లా కార్య దర్శి అహల్య, షేక్ ఖాదర్ వలీ షఫీ,వీర చక్రం,పట్టణ ఉపాధ్యక్షులు కొప్పరపు నాగేశ్వర రావు,ప్రవీణ్ గౌడ్,సంతోష్ కుమార్, పీరయ్య,శివపురం రవి కుమార్,రాచర్ల కాసులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులు ఆధునిక సస్య రక్షణ పద్ధతులు పాటించాలి

**మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి**



**పొదిలి, పెన్ పవర్, జూలై 29**

రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయాధికారి దేవి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి చెప్పారు మంగళవారం నాడు మండలంలోని పాములపాడు, ఈగల పాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతులతో వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి సమావేశం జరిపి పంటల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగ పరుచుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు వ్యవసాయపరంగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు గాని, కష్ట నష్టాలు గానీ ఎదురైతే తమ శాఖ ద్వారా ఆయా సమస్యలను పరిష్కరించుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీనివాసులు రెడ్డి సూచించారు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బ్రహ్మం మాట్లాడుతూ పశు భీమా గురించి రైతులకు వివరించారు అలాగే పసుపు పోషకులు తమ పశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి కూడా ఆయన చెప్పారు ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సహాయకురాలు మను కిరణ్ తో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఈగల పాడు గ్రామంలో వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం



**పొదిలి, పెన్ పవర్, జూలై 29**

మండలంలోని ఈగల పాడు గ్రామంలో మంగళవారం నాడు వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం జరిగింది వైద్య ఆరోగ్య శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆ గ్రామం లోని ప్రజలకు డెంగు, మలేరియా లాంటి వైరల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి వివరించారు ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా తమ ఇండ్లను, ఇండ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కృష్ణ, నరసారెడ్డి, సునీత తో పాటు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## పిఎంశ్రీ పాఠశాలల్లో అత్యుత్తమ బోధన సదుపాయాలు

**ఎంఈఓ రాజాల కొండారెడ్డి**



**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 29**

మండలంలోని పిఎంశ్రీ పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు అత్యుత్తమ బోధన సదుపాయాలు కల్పించినట్లు మండల విద్యాశాఖ అధికారి రాజాల కొండారెడ్డి అన్నారు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నూతన విద్యా విధానం 2020 అమలులో భాగంగా పిఎంశ్రీ ఐదేళ్ల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు విద్యార్థులకు పలు పోటీ కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పిఎంశ్రీ పాఠశాలల్లో స్కౌట్స్ మరియు గైడ్స్ అమలు కోసం 50 వేల రూపాయలు అలాగే స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు 25 వేల రూపాయలు నిధులు విడుదల చేసిందన్నారు పిఎంశ్రీ పథకం ద్వారా పాఠశాలల్లో ఆట స్థలాలు అభివృద్ధి, గ్రంథాలయాల ఏర్పాటు, అటల్ టింకరింగ్ ల్యాబ్ ల ఏర్పాటు, సైన్స్ ల్యాబొరేటరీ లు, అదనపు గదుల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు విద్యార్థులలో సాంకేతికత, అభివృద్ధి, వృత్తి శిక్షణ, కెరీర్ గైడేన్స్, నైపుణ్యత పెంపుదల కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేచిందని విద్యా రంగ అభివృద్ధిలో పిఎంశ్రీ పాఠశాలలు మార్గదర్శకంగా నిలుస్తాయని విద్యార్థులకు అవగాహన కల్పించారు అనంతరం పిఎంశ్రీ పథకంలో భాగంగా చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు ఈ కార్యక్రమంలో సీఆర్పీ సతీష్ కుమార్, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి...



**పుల్లల చెరువు పెన్ పవర్ జూలై 29**

రాష్ట్ర సిపిఐ మాసభలను జయప్రదం చేయాలని పుల్లలచెరువు మండలంలో మంగళవారం తెల్లగట్ల,ముట్టుకుల, మర్రివేముల గ్రామాలలో సిపిఐ రాష్ట్ర మహాసభ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి గురునాథం మాట్లాడుతూ శతజయంతి సందర్భంగా జిల్లా కేంద్రమైన ఒంగోలులో రాష్ట్ర మహాసభలు ఆగస్టు 20 నుండి 25 వరకు జరుగు సభలను పాల్గొని జయప్రదం చేయాలని,నిరంతరం ప్రజా ఉద్యమాల్లో పాల్గొని బడుగు బలహీన వర్గాల ప్రజా శ్రేయసు కోసం పోరాడే ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. ఎంతో వైభవంగా జరిగే ఈ రాష్ట్ర మహాసభల్లో కవులు, మేధావులు, విప్లవ కార్లు, జిల్లా,రాష్ట్ర,జాతీయ సిపిఐ ప్రతినిధులు,వంద రకాల కళారూపాలతో జరిగే మహాసభకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి గుంటూరు శ్రీనివాసరావు చారి,ముటు కుల శాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు,మర్రివేముల శాఖ కార్యదర్శి కంచర్ల గురవయ్య గౌడ్, ఆయా గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యను అందించండి

గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్.





**పెన్ పవర్ ,కంభం జూలై 29:**

విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపట్టి గురుకుల పాఠశాలల్లో, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలను ఖర్చుచేస్తుందని, పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. మంగళవారం కంభం మండలం, కందులాపురంలో గల డా. బి ఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులతో ప్రత్యేకంగా ముట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. వసతి గృహంలో నీటి సమస్య ఉందని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆర్ ఓ వాటర్ నిర్వహణ రూమ్ ను, డార్మెటరీ, టాయిలెట్స్ ను జిల్లా కలెక్టర్ పరిశీలన చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజు బాలికలకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా లేదా, శుభ్రం చేసే ప్రదేశాలు, బాత్రూములు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉన్నాయా, లేదా, వాటి నిర్వహణ, ఉదయం సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్న వేళలు, వసతి గృహ నిర్వాహకుల పనితీరు తదితర అంశాలలో వసతి గృహంలోని బాలికలను, సిబ్బందిని ప్రశ్నించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మెనూను కచితంగా అమలు చేయాలని, అలాగే నాణ్యతతో భోజనం విద్యార్థులకు అందించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రత పై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, తహసిల్దార్ శ్రీ కిరణ్, విద్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గత పాలకుల నిర్వాకంతో రాష్ట్రం అస్తవ్యస్థం

## రాష్ట్రంలో అభివృద్ధి - సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

### గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల









**గిద్దలూరు పెన్ పవర్ జులై 29**

గత వైసిపి పాలకుల నిర్వాహకంతో రాష్ట్రం అస్తవ్యస్తమైందని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం గిద్దలూరు మండలంలోని అంబవరం, జయరాంపురం వెల్లుపల్లె గ్రామ పంచాయతీలలో పర్యటించిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి గ్రామంలోని మహిళలను, అవ్వ తాతలను కలుసుకొని ఆప్యాయంగా పలకరించి. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంబవరం, వెల్లుపల్లె గ్రామాలలో రూ. 20 లక్షల రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి పాలకులు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చక పోగా రాష్ట్ర సంపదను దోచుకోవటానికే పాలన సాగించారే తప్ప రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేయలేదన్నారు. నవరత్నాల పేరుతో, రాష్ట్ర ప్రజలను నయవంచన చేశారని బటన్ నొక్కటం తప్ప రాష్ట్రంలో ఒక తట్ట మట్టి కూడా వేసిన దాఖలాలు లేవన్నారు . గత వైకాపా పాలకుల దోపిడీ పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. 2024 అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేయటమే లక్ష్యంగా పెట్టుకుందని ఇప్పటికే నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ. 50 కోట్ల రూపాయలతో సిమెంట్ రోడ్లు, ఆర్ – బి రోడ్లు, లింక్ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలకు మంచి చేయటమే తెలుసునని, మేలు చేసిన కూటమి ప్రభుత్వాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు జడ్పీటీసీ సభ్యులు బుడతా మధుసూదన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, సొసైటీ బ్యాంకు చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, డైరెక్టర్ బద్రి గోపాల్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ కంకర వెంకట రెడ్డి, వీర్ల అల్లురయ్య, నారాయణ రెడ్డి, మోడీ కాశయ్య, మల్లెబోయిన గంగాధర్, మోడీ కాశయ్య, రామలింగస్వామి, అనిల్, రామశంకర్ రెడ్డి, మండలంలోని పలువురు సర్పంచులు, నాయకులు, పాల్గొన్నారు.

# నూతన గృహప్రవేశ కార్యక్రమంనకు హాజరైన బోయళ్ళ నారాయణరెడ్డి



**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 29**

సి ఎస్ పురం గ్రామంనకు చెందిన గుర్రం లక్ష్మీనారాయణ నూతన నిర్మించిన గృహ ప్రవేశ వేడుకలకు ఆహ్వాన మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బోయళ్ల నారాయణరెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు గుర్రం లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు గృహప్రవేశ వేడుకల్లో శ్రీరాం శ్రీనివాసులు, వరికూటి చిరంజీవి, వరికూటి హనుమంత్, గుర్రం మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద ప్రకాశం జిల్లా ఎంపిక



**బేస్తవారిపేట పెన్ పవర్ జూలై 29**

బేస్తవారిపేట మండలంలోని గలిజేరుగుల్ల మరియు సింగరపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది రా కార్యక్రమాన్ని మంగళవారం బేస్తవారిపేట మండల వ్యవసాయ అధికారి షేక్ అబ్దుల్ రఫీక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న నాటు ఎటువంటి రైతులు మరియు నాటిన రైతులు కంపెనీ ప్రతినిధుల నుండి విధిగా అగ్రిమెంట్ తీసుకున్న తర్వాతనే మొక్కజొన్న సాగు చేయాలని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద వరి,కంది, ఎండుమిరప, మినుము, సజ్జ పంటలకు మీసేవ కేంద్రాల నందు క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్కే సిబ్బంది మరియు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రైతులకు ఉద్యాన పంటల పై రాయితీలు






**(పెన్ పవర్, టంగుటూరు)**

ప్రకాశం జిల్లా, టంగుటూరు మండలంలోని వ్యవసాయ కార్యాలయం నందు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటలు సాగు గురించి మండల స్థాయిలో గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు మరియు ఫీల్డ్ అసిస్టెంట్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం కు ఒంగోలు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ వి రమేష్ బాబు గారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉద్యాన శాఖ అధికారి శ్రీ ఎన్ తేజ గారు మాట్లాడుతూ పండ్ల తోటలు కూరగాయలు పెంచుటకు రైతులకు కలిగే రాయితీలను గురించి వివరించారు. ఫామ్ పాండ్స్ ద్వారా ఒక్కొక్క రైతుకు 75 వేల రూపాయలు వరకు రాయితీ పొందవచ్చునని తెలియజేశారు, పథకాల రాయితీలు ,అర్హతలు గురించి క్లుప్తంగా వివరించి రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల గారు, రామకృష్ణారెడ్డి, అన్ని గ్రామాల వ్యవసాయ ఉద్యాన సహాయకులు మరియు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# గోనెపూడి ప్రసాద్ టిడిపిలో చేరిక

**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 29**

మండలంలోని చింతపూడి పంచాయితీ కోమటిగుంట్ల గ్రామంనకు చెందిన గోనెపూడి ప్రసాద్ మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, గుంటిమడుగు శ్రీనివాస్ వర్మ, అట్లూరి రామకృష్ణంరాజు, యూనిట్ ఇన్చార్జి చావా చంద్రశేఖర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పసుపులేటి గురు కృష్ణ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఆయనకు కండువా కప్పి స్వాగతం పలికారు ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నాయకత్వంలో అభివృద్ధి సాధ్యమని గుర్తించి పార్టీలో చేరినట్లు తెలిపారు.



# పేదరికం లేని సమాజాన్ని ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

### :పి4 కార్యక్రమంలో ప్రవీణ్ భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషం

### ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





**కందుకూరు పెన్ పవర్, జూలై 29:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనతో, పేదరికం లేని సమాజాన్ని ఏర్పాటు చేసే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం పి 4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ భాగస్వామ్యం) కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. అట్టడుగున కుటుంబాలను పైకి తీసుకురావడం పి 4 ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా కందుకూరు పట్టణానికి చెందిన కాకుమాని ప్రవీణ్ కుమార్ 5 మంది నిరుపేదలకు రూ. 2000 ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొంతమంది పేదలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నప్పటికీ కొన్ని ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న తరుణంలో పేదరిక నిర్మూలన ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి4కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఈ పిలుపునకు స్పందించిన కాకుమాను ప్రవీణ్ కుమార్ 5గురు పేదలకు ఒక సంవత్సరం పాటు ప్రతినెల ఆర్థిక సాయం అందించడం శుభ పరిణామం అని అన్నారు. నియోజకవర్గంలో ఆర్థికంగా స్థిరపడిన ప్రతి ఒక్కరూ, విదేశాలలో ఉండే ఎన్నారైలు పి4కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపుతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచనల మేరకు తన పెళ్లిరోజు సందర్భంగా డబ్బులు వృధా చేయకుండా పేదలకు ఒక సంవత్సరం పాటు ప్రతినెల సాయం అందజేస్తానని తెలిపారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కి, కాకుమాని ప్రవీణ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ పి 4 కార్యక్రమంలో భాగస్వాములైన కాకుమాని ప్రవీణ్ ను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఆర్యవైశ్య నాయకులు మురారిశెట్టి సుధీర్, చక్కా వెంకట కేశవరావు, కోటా కిషోర్ బాబు, కంకణాల వెంకటేశ్వర్లు, కోట వెంకట నరసింహం, కొత్తూరి సుధాకర్ రావు, ఇస్కాల మధు,ఇన్నమూరి శీను, ఓరుగంటి శివశంకర్, కొత్త నరేంద్ర, ముమ్మిడిశెట్టి శ్రీనివాసులు, రవ్వా శ్రీనివాసులు, కోట వెంకటేశ్వర్లు, వేమూరి సుధాకర్, మురారి శెట్టి వెంకటేశ్వర్లు తదితర ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

# 30వ తేదీన రాజుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

### ఆర్ డి ఎస్ ఎస్ పథకం ద్వారా కొత్త లైన్ల ఏర్పాటు.

**కొమరోలు పెన్ పవర్ జూలై 29.**



కొమరోలు మండలంలోని రాజుపాలెం విద్యుత్ సబ్ సెంటర్ పరిధిలోని గ్రామాలకు ఈ నెల 30వ తేదీ బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు. ఆర్ డి ఎస్ ఎస్ పథకం ద్వారా మండలంలో అమలు జరుగుతున్న కొత్త లైన్ల ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా ఈనెల 30వ తేదీన రాజుపాలెం విద్యుత్ సబ్టేషన్ పరిధిలోని గ్రామాలలో కొత్త లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఆ కారణంగా రాజుపాలెం, ముక్తాపురం, వెన్నం పల్లె ,బసువుపల్లె, పాయలపల్లె, రౌతు పల్లె, ద్వారకచర్ల, వెంకటాపురం గ్రామాలకు బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్న ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లుగా ఆయన తెలిపారు. కావున వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకొని విద్యుత్ శాఖకు సహకరించాలని ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

# అడవికి రారాజు అయిన పులులు వాటి ఆవాసాల్లో స్వేచ్ఛగా జీవించాలి

### అంతరించిపోయే దశకు వచ్చిన పులుల సంరక్షణకు సహకరించాలి.

### పులుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించిన బేస్తవారిపేట రేంజి అటవీ శాఖ అధికారులు సిబ్బంది.







**కొమరోలు పెన్ పవర్ జూలై 29**

అడవికి రారాజుగా పేరుపొందిన పులులు ,వాటి ఆవాసాల్లో స్వేచ్ఛగా జీవించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అల్లినగరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ డి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గ్లోబల్ టైగర్ డే సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం కొమరోలు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు .ఆ కార్యక్రమానికి ఆ పాఠశాల హెడ్మాస్టర్ శివ నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా,,బేస్తవారిపేట రేంజ్ అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, అల్లినగరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు .ఆ సందర్భంగా విద్యార్థులకు పులుల ప్రాముఖ్యత, వాటి సంరక్షణ ,అంతరించిపోతున్న పులుల సంఖ్య ,వాటిని కాపాడి అభివృద్ధి చేయుటకు అంతర్జాతీయంగా తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అల్లినగరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అడవికి రారాజు అయినా పులులను వాటి ఆవాసాల్లో స్వేచ్ఛగా జీవించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వివిధ కారణాలవల్ల పులులు అంతరించిపోయే దశ కు వచ్చాయని ,వాటిని సంరక్షణ చేసి అభివృద్ధి చేయవలసిన కార్యక్రమాన్ని అంతర్జాతీయంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. భారతదేశం లోనే అతిపెద్ద పులుల సంరక్షణ కేంద్రమైన నాగార్జునసాగర్ -శ్రీశైలం- టైగర్ రిజర్వు (ఎన్ ఎస్ టి ఆర్ )లో పులుల సంఖ్య గణనీయంగా పెంపొందించేందుకు అటవీశాఖ కృషి చేస్తున్నదని ఆయన తెలిపారు. ఆ కార్యక్రమంలో బేస్తవారిపేట రేంజి అటవీశాఖ సిబ్బంది ,తదితరులు పాల్గొని పులుల ప్రాధాన్యత వాటి సంరక్షణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విశ్వరూప చారి విద్యార్థులకు పులుల గొప్పతనాన్ని ,ఆవశ్యకతను, వాటిని కాపాడవలసిన అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. ఆ కార్యక్రమంలో అల్లినగరం బీట్ బేస్ క్యాంప్ సిబ్బంది నాగరాజు, రమణయ్య, నారాయణమూర్తి, బాల రంగయ్య ,సురేష్, బేస్తవారిపేట రేంజ్ సిబ్బంది ,ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# చెన్నిపాడు భోగణంపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం..







**పొన్నలూరు పెన్ పవర్ జులై 29**

మండలంలోని రావులకొల్లు ఉప్పలదిన్నె గ్రామాలలో మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రాము మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్లో వేసిన ప్రతి పంటకూ పంట నమోదు కార్యక్రమం ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సంబంధిత వ్యవసాయ సహాయకులు ద్వారా చేసుకోవాలని సూచించారు . ఖరీఫ్ రబీ సీజన్లో వేసే ప్రతి కౌలు రైతు మీ సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులకు మీరు వేసే పంటను తెలియజేసి గ్రామ రెవెన్యూ అధికారులు ద్వారా కౌలు ధ్రువీకరణ పత్రాలను పొందవచ్చునని, తద్వారా రాబోయే రోజుల్లో వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు విత్తనాలు,ఎరువులు, ధాన్యం అమ్ముకోవడానికి, ప్రకృతి వ్యాపారిత్యాల వల్ల వచ్చే పంట నష్టం లేదా పంట పండకపోతే ఇన్సూరెన్స్, బ్యాంకు నుండి పంట రుణాలు మరియు అన్నదాత సుఖీభవ వంటి పథకాలను పొందవచ్చునని తెలియజేసారు. రాష్ట్రప్రభుత్వం 2025-26 సం,, ఖరీఫ్ సీజన్ కి గాను,పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించింది,,(క్వింటాలు) వరి సాధారణం రూ.2360.00 , వరి ఏ గ్రేడ్ రూ.2389.00 , కంది 8000.0, పెసర 8768.00, మినుము 7800.00,నువ్వులు 9846.00 ప్రొద్దుతిరుగుడు 7721.00, సజ్జ 2775.00 జొన్న 3699.00, మొక్కజొన్న 2400.00 వేరుశనగ 7263.00 ,, కావున రైతులు నీటి వసతినీ బట్టి పైన తెలియపరచిన పంటలను సాగు చేసి మంచి ఆదాయాన్ని పొందవచ్చు అని తెలిపారు, మండలంలో సాగు చేసే పంటలకు ఖరీఫ్ సీజన్ కి సంబంధించి ఇన్సూరెన్స్ చేసుకోవాలని (ఎకరాకు) వరికి రూ.860.00 కంది రూ .430.00 , సజ్జ రూ.156.00 మినుము రూ .205.00 నువ్వులు రూ .180.00 మరియు ఎర్ర మిరపకు రూ.4500.00 దీనికి సంబంధించి ప్రకాశం జిల్లాలో ఇ సి ఐ సి లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ అనే ఇన్సూరెన్స్ కంపెనీకి రైతులు మీ ప్రీమియం జూలై 31లోపల, వరికి మాత్రం ఆగస్టు 15తేదీ లోపల ప్రీమియం చెల్లించాలని తెలియజేసారు.పొన్నలూరు పశు వైద్యాధికారి డాక్టర్ పి.శివరామ క్రిష్ణ మాట్లాడుతూ పశు పోషకులకు పశువులలో వచ్చు వ్యాధులు గురించి మరియు వివిధ పథకాలు గురించి వివరించారు.ఉద్యానవన శాఖ అధికారిని పి.విష్ణుప్రియ మాట్లాడుతూ ఉద్యానవన శాఖ నుండి కూరగాయలు, పండ్లు మరియు పూల తోటల పెంపకానికి 40శాతం రాయితీ వస్తుందని, అలాగే పండ్ల తోటలు గల రైతులకు సేద్యపు కుంటలు మల్చింగ్ రాయితీ తో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా డ్రిప్ మరియు స్ప్రింక్లర్ ఉన్నాయని, 10ఎకరాల లోపు రైతులకు 90 శాతం డ్రిప్ మరియు 5ఎకరాల లోపు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం రాయితీ తో డ్రిప్ అందుబాటులో ఉన్నాయని కావున కావలసిన రైతులు అన్ని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు.తదుపరి నువ్వు పంటను పరిశీలించి వేపనూనె 10మి.లీ మరియు క్లోరో పైరిఫాస్ 2.5 మి.లీ.ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి మొదటి దశ పురుగులు రాకుండా నివారించి పైరును కాపాడుకోవచ్చని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో రావులకొల్లు గ్రామ వ్యవసాయ సహాయకులు ఎ.నాగమల్లేశ్వర రెడ్డి పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ , గ్రామ పశు వైద్య సహాయకులు నవనీత ఉప్పలదిన్ని గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్.ఇమ్రాన్ నజీర్, గ్రామ పశు వైద్య సహాయకులు షేక్ మోబిన రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం





**మార్కాపురం ఆర్.సి ఇన్చార్జి పెన్ పవర్ జులై 29**

శ్రావణమాసం సందర్భంగా మండలంలోని బొందలపాడు గ్రామంలో శ్రీ పట్టాభి సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.మారంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మారంరెడ్డి అంకిరెడ్డి, కోనారెడ్డి ఆధ్వర్యంలో ఈ కళ్యాణోత్సవం భక్తిశ్రద్ధల మధ్య సాగింది. ఈ కళ్యాణ ఉత్సవంలో ఆది దంపతులుగా కళ్ళ కోట సుబ్బారావు, రత్తమ్మ వ్యవహరించారు. శ్రీ రామచంద్రమూర్తి సీతమ్మ వారి మాంగళ్య ధారణ భక్తులను కనువిందు చేసింది. ఈ ఈ కళ్యాణం ఉత్సవంలో గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారీని దర్శించుకుని తీర్థప్రద ప్రసాదాలను స్వీకరించారు.

# తాతిరెడ్డిపల్లెలో రెండవ రోజు కొనసాగిన సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాల పంపిణీ

## కరపత్రాలు పంపిణీ చేసిన మండల తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు.

## ఉత్సాహంగా పాల్గొన్న గ్రామస్తులు.





**కొమరోలు పెన్ పవర్ జూలై 29**

కూటమి ప్రభుత్వం తొలి వసంతాన్ని విజయోత్సవంతో ముగించుకుని మలి వసంతంలోనికి అడుగు పెట్టిన సందర్భంగా విడుదల చేసిన సుపరిపానలో తొలి అడుగు కరపత్రాలను గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు, కొమరోలు సహకార సంఘం చైర్మన్ ముత్తుముల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో పలువురు టిడిపి నేతలు ,కార్యకర్తలు మంగళవారం కొమరోలు మండలం తాతిరెడ్డి పల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. సోమవారం ఆ గ్రామంలోని కొన్ని ఇళ్లకు కరపత్రాలను పంపిణీ చేశారు. మిగిలిన ఇళ్లకు మంగళవారం కూడా కరపత్రాలు పంపిణీ కార్యక్రమం చురుకుగా సాగింది. ఆ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర అభివృద్ధికి ,ప్రజా సంక్షేమానికి చేస్తున్న కృషిని నేతలు ప్రజలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తున్నారని అంటూ వాటిపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకున్నారు. తమకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని ప్రజలు తెలిపారని, రాష్ట్ర ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజలు సంతృప్తి హర్షం వ్యక్తం చేస్తున్నారని నేతలు తెలిపారు .ఆ కార్యక్రమంలో కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాలుగుల్ల మల్లికార్జున్ రెడ్డి ,న్యాయవాది విజయకుమార్ రెడ్డి ,కొమరోలు వార్డు మెంబర్ షేక్ సుభాని,పట్టణ యువ నాయకులు బిన్నీ భాష, షాను ,నాయబ్ రసూల్ ,కరీముల్లా, ఖాజావలి ,భాష తోపాటు తాతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా మంగళవారం పుల్లారెడ్డి పల్లె లో సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలు పంపిణీ చురుకుగా సాగింది .ఆ కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఎస్సీ విభాగానికి నియోజకవర్గ అధ్యక్షులుగా పదవులు





**దర్శి జూలై 29 పెన్ పవర్**

మండల కేంద్రంలో నాలుగు బొమ్మల సెంటర్ లో గల మహాత్మా గాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరువు వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహల కి పూల మాల వేసి మీడియా తో మాట్లాడం జరిగింది. నియోజకవర్గ సమన్వయకర్త కైపు వెంకటకృష్ణా రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న మద్యం మాఫియా ఇసుక మాఫియా గురించి అలాగే నియోజకవర్గంలో టిడిపి ఇన్చార్జ్ గొట్టిపాటి లక్ష్మీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు గురించి గుర్తు చేస్తూ దర్శి లో అర్ధాంతరంగా ఆగిపోయిన ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్, దొనకొండలోని తాగునీటి సమస్యల, దొనకొండలో పరిశ్రమల, మొగలకుండా రిజర్వాయర్, అలాగే దర్శి లో హాస్పిటల్ లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతుంటారు గొట్టిపాటి లక్ష్మీ ను మీరు ఇల్లు కాదు హాస్పిటల్ లో నిర్మించండి, నియోజకవర్గంలో ఉపాధి లేక యువత పడుతున్న ఇబ్బందులు, కూటమీ ప్రభుత్వం చెప్పిన హామీలు అమలు కాకపోవడం గురించి మీడియా ముందు వివరించడం జరిగింది అలాగే త్వరలో ఇంటింటికి కాంగ్రెస్ అనే కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు తెలియజేయడం జరిగింది. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినటువంటి 2024 అభ్యర్థిగా పోటీ చేసిన పుట్లూరు కొండారెడ్డి గురించి మాట్లాడుతూ ఇక మీదట పార్టీ గ్రూపుల్లో వైయస్ షర్మిల రెడ్డి గారి గురించి గానీ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా గురించి కానీ అవాకులు చవాకులు పేలితే తీవ్ర పరిణామాలు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మన్నం ప్రసన్నకుమార్ రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 60 వేల ఎస్సీ ఓటర్లు ఉన్నారు, వల్ల నీ ఇంటి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ చేసిన మంచి పనుల గురించి వివరించండి అని తెలియజేయడం జరిగింది. రాష్ట్రంలో లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక దళితులు మీద దాడులు అత్యాచారాలు పెట్రేగిపోతున్నాయి, ఈ పరిణామాల్ని ఎదుర్కొనేటందుకు కాంగ్రెస్ పార్టీ దళితులకు అండగా ఉంటుందని జిల్లా ఎస్సీ అధ్యక్షులు తెలిపేరు. జిల్లా ఉపాధ్యక్షులు గోరంట్ల కోటేశ్వర రావు మాట్లాడుతూ దర్శి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కి కంచుకోట అందరం కలిసికట్టుగా పని చేసి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ నీ బలోపేతం చేదం అని తెలియజేసారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు ప్రశాంత్ మాట్లాడుతూ ముందుగా నియోజకవర్గ ఇన్చార్జి కైపు వెంకటకృష్ణారెడ్డి అలాగే ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మన్నం ప్రసన్న రాజ్ కి మరుయు జిల్లా ఉపాధ్యక్షులు గోరంట్ల కోటేశ్వర రావు కి ధన్యవాదాలు తెలుపుతూ నియోజకవర్గంలో ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు.. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరిగినేని నరసయ్య, మాజీ జిల్లా అధికార ప్రతినిధి బొడ్డు సతీష్, దర్శి మండల అధ్యక్షులు కరిపిరెడ్డి శ్రీరామ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సిరిమల్లె పొలేష్, తాళ్లూరు మండల అధ్యక్షులు కూకట్ల వీరబ్రహ్మం, దొనకొండ మండల అధ్యక్షులు రామిరెడ్డి శివారెడ్డి కమల్ సాయిబ్, సుబ్బా రెడ్డి, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# బేస్తవారిపేటలో సర్వీస్ రోడ్డును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సరియా

**బేస్తవారిపేట, పెన్ పవర్ జూలై 29:**

అనంతపురం - అమరావతి స్టేట్ హైవే రోడ్ 544డి లోని బేస్తవారిపేట పట్టణంలో జాతీయ రహదారి వెంట అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్లను;ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సరియా;మంగళ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సర్వీస్ రోడ్డు వెంట ఉన్న షాపులు యజమానులు వినతి పత్రం అందజేశారు. షాపు యజమానులు గతంలో 30 మీటర్లుగా రోడ్డు నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చారని, 25 మీటర్లు రోడ్డు తీసుకోవాలని; విజ్ఞప్తి చేశామన్నారు. నేషనల్ హైవే అధికారులు స్థానిక షాపుల యజమానుల అభిప్రాయాలు తీసుకోకుండా వాళ్ళు ఇష్టానుసారంగా రోడ్డు నిర్మాణం చేపట్టారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.అనంతరం పాత ఎఫ్ఎంబి ప్రకారం సర్వే చేసి మార్కింగ్ ఇవ్వాలని, ఈ మార్కింగ్ ప్రకారం షాపుల స్థలాలు ఎంతవరకు పోతున్నాయి. స్థానిక ప్రజలు బెస్తవారిపేట పట్టణంలో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయడం వలన దాదాపు 400 ఇండ్ల యజమానులు,షాపులు దెబ్బతినే అవకాశం ఉందని సర్వీస్ రోడ్డు నిలుపుదల చేసి బేస్తవారిపేట వెలుపల బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. అలాగే స్థానిక ప్రయాణికులు మండల కేంద్రమైన బేస్తవారిపేటలో ఆర్టీసీ బస్టాండ్ లేకపోవడంతో మహిళ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ వెంట మార్కాపురం సబ్ కలెక్టర్, బెస్తవారిపేట తాసిల్దార్ జితేంద్ర కుమార్, స్థానిక విఆర్వోలు, మండల సర్వేయర్, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొండపి పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి. మంత్రి స్వామి



**(పెన్ పవర్, టంగుటూరు)**

ప్రకాశం జిల్లా ,టంగుటూరు మండలం, తూర్పునాయుడుపాలెం మంత్రి క్యాంప్ ఆఫీసు నందు కొండేపి టిడిపి నాయకులతో మంత్రి స్వామి సమావేశం అయ్యారు. ఆగస్టు 10వ తేదీన కొండేపి పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మంత్రి నాయకులకు దిశా నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ 14 సంవత్సరాల తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికల్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొండేపి నియోజకవర్గానికి కోట్లాది రూపాయలతో అభివృద్ధి సంక్షేమ పనులు జరిగాయన్నారు, నేటి నుండి ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు ఈ ఎన్నికలపై దృష్టి సారించి ఐకమత్యంగా పనిచేసి భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి డా. శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు.

# బాబు షూరిటీ మోసం గ్యారంటీ

**దొనకొండ జూలై 29 పెన్ పవర్**

మండలంలో స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన ద్రోహాన్ని కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి తెలియజేయాలంటూ జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ వైయస్సార్సీపి జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో విస్తృతస్థాయిలో జగనన్న హాయంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు సంపూర్ణంగా అమలు అయ్యాయని ఈ కూటమి ప్రభుత్వం హయాంలో ఒక్క పథకం అంటే ఒకటి కూడా సరిగా అమలు కాలేదు అన్నారు. కరోనా సంక్షేమ సమయంలో కూడా జగనన్న ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని అలానే కరోనాతో ఇబ్బందిపడి ఆసుపత్రి పాలైన వారికి కూడా ఎంతో ఖర్చు చేశారన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలను వేధించడమే పనిగా కూటమి ప్రభుత్వం పెట్టుకుందన్నారు. కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసేందుకు కీలక వైసిపి నాయకులపై దొంగ కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారన్నారు. ఎవరు భయపడవలసిన అవసరం లేదని మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమేనని బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి కార్యకర్తలకు ధైర్యం పోశారు. ఈకార్యక్రమంలో దొనకొండ మండల వైసీపీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ ఆంజనేయ రెడ్డి, గుంటు పోలయ్య, గుంటు జాకబ్, సర్పంచ్ వెంకట్ రెడ్డి వెంకటసుబ్బయ్య, సర్పంచులు ఎంపీటీసీలు జడ్పీటీసీలు మరియు మండల స్థాయి ఆయా క్యాడర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





## మంచి నీటి పైప్ లైన్ కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యేకి ధన్యవాదాలు





**కందుకూరు పెన్ పవర్, జూలై 29**

కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో పట్టణంలోని 6వ వార్డులోనీ లుంబినివనం ప్రాంతంలో సుపరిపాలనలో తొలి ఏడాది కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలు కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ తొలి సంవత్సరంలో కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ నివసిస్తున్న స్థానికులు మంచి నీటి పైపు లైన్ కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు షేక్ మున్నా,నియోజకవర్గ ముస్లిం మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, పట్టణ టిడిపి ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ బాషా,వార్డు ప్రధాన కార్యదర్శి జంగాల మాలాద్రి, సునీల్,తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి**



**కందుకూరు పెన్ పవర్, జూలై 29**

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇస్తుందని స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యమంత్రి సహాయ నిధి 1,09,032 రూపాయల గల 2 చెక్కులను లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఆర్థిక స్తోమత లేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టాల్లో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వంలో పేదల ఆరోగ్యం విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, యువ నాయకులు నారా లోకేష్ ఎంత పెద్ద మొత్తంలో నైనా ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కిలారి కొండయ్య, జాజుల కొండయ్య పాల్గొన్నారు.

## రీ సర్వేకు 38 గ్రామాలు ఎంపిక

**:సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ**

**కందుకూరు పెన్ పవర్, జూలై 29**

గ్రామపంచాయతిలోని గ్రామ కంటంలోని ఇళ్లు, గ్రామకంటంను ఆనుకొని ఉన్న భూములలోని ఇళ్లని రీ సర్వే జరిపి వారికి యాజమాన్య హక్కులు కలిపిచుటకు గాను ప్రభుత్వం వారి అదేశముల మేరకు స్వామిత్వ -రీ సర్వే కార్యక్రమము చేపట్టుటకుగాను ఫేజ్ 2 కింద కందుకూరు డివిజన్ నందు 38 గ్రామములను ఎంపిక చేసినట్లు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ తెలిపారు. సదరు గ్రామములకు సంభందించిన కార్యదర్శులు, ఇంజనీరినిగ్ సహాయకులకు డిజిటల్ సహాయకులకుకొలతలు తీసుకోనుటపై అవగాహన కల్పించారు. సబ్ కలెక్టర్ కందుకూరు వారి కార్యాలయము నందు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, పి. వి. ప్రభాకర రావు , డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, టాస్క్ ఫోర్సు టి. ఆనంద్, డిఎల్పీ ఓ కే. కృష్ణ మోహన్ నిర్వహించారు. కార్యక్రమమును సబ్ కలెక్టర్ శ్రీ పూజ పర్యవేక్షించారు. శిక్షణానంతరము శిక్షకులకు పరిక్ష నిర్వహించి మంచి అవగాహన కనపరిచిన ఐదుగురికి మొమెంటోలు బహుకరించారు.



# దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

## వెంకటాద్రిపాలెంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ













**కందుకూరు పెన్ పవర్, జూలై 29**

దాతలు చేసే సహకారాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చక్కగా చదువుకోవాలని మండల విద్యాశాఖ అధికారి అజయ్ బాబు అన్నారు. చేయి చేయి కలుపుదాం ఆపదలో ఉన్న వారిని ఆదుకుందాం అనే నినాదంతో మేక్ ఏ చేంజ్ సొసైటీ కందుకూరు వారి సహకారంతో మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాలెం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోటు పుస్తకములు,పలకలు, శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ వారు కూలింగ్ వాటర్ క్యాన్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ అజయ్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు నోటు పుస్తకాలు తదితరు వస్తువులు అందజేయడం అభినందనీయమన్నారు. ఎంఈఓ 2 సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ సొసైటీ ఇప్పటికే మండలంలోని సుమారు 15 పాఠశాలల్లో నోటు పుస్తకాలు తదితర వస్తువులను అందజేశారని మండల విద్యాశాఖ తరపున వారికి అభినందనలు తెలిపారు. దాతలు సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని ఈ పాఠశాలకు ఇప్పటికే గ్రామానికి చెందిన దాత రావూరి కొండయ్య రెండు లక్షల రూపాయలతో ఆట వస్తువులను అందజేశారని గుర్తు చేశారు. ఈ పాఠశాలకు ఎల్లప్పుడూ తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని దాత రవ్వ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ప్రతి ఏడాది నోటు పుస్తకాలను అనేక వస్తువులను పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ పాఠశాల వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉందని చిన్నప్పుడు తమ పాఠశాల గుర్తుకు వస్తుందని తెలిపారు. డాక్టర్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా మేక్ ఏ చేంజ్ సొసైటీ ద్వారా ఎన్నో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వారికి అవసరమైన విద్యాసామాగ్రిని వారి సంస్థ ద్వారా అందిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నారని,ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు పలకలు విద్యా సామాగ్రిని అందజేయటం ఎంతో మంచి కార్యక్రమం అని అన్నారు. ఇలాగే మేక్ ఏ చేంజ్ సొసైటీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని వారిని అభినందించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు, పలువురు ఉపాధ్యాయులు తదితరులు విద్యార్థులనుదేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మేక్ ఏ చేంజ్ సొసైటీ సభ్యులు డాక్టర్ రవ్వా శ్రీనివాసులు, పాఠశాల చైర్మన్ కాకుమాని శ్రీనివాసులు,గ్రామ పెద్దలు మేకల వెంకటేశ్వర్లు, ఘట్టమనేని శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పరమానందం,వెంకటరావు, శాంత కుమారి,ప్రమీల, హరిత తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

**అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు - అంగన్వాడి నూతన బిల్డింగ్ ప్రారంభం**

**చెత్త సంపద తయారీ కేంద్రం ప్రారంభం - ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**







**లింగసముద్రం పెన్ పవర్, జూలై 29:**

గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పించడం కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలం లోని పెదపవని గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా ముత్యాలపాడు గ్రామంలో 10.30 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన అంగన్వాడి కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పెదపవని గ్రామంలో 31.00 లక్ష రూపాయలతో నూతనంగా నిర్మించిన సి.సి రోడ్, సైడ్ కాలవలను ఎమ్మెల్యే ప్రారంభించారు. చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి సంవత్సరంలోనే గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పన కల్పించడంలో విజయం సాధించిందని తెలిపారు. గ్రామంలో ఎమ్మెల్యే ప్రతి ఇంటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం తొలి సంవత్సరంలో అందించిన సంక్షేమ పథకాలు వివరిస్తూ, ఏ కారణం చేతనైనా వారికి సంక్షేమ పథకాలు అందనిచో దాని గల కారణాలు తెలుసుకొని పరిష్కరించాలని అధికారులకు సూచించారు.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.. ఏ ఇంటికి వెళ్లిన సంక్షేమ పథకాల పొందిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో గ్రామాల్లో ఎక్కడ గుంతల రోడ్లకు గంప మట్టి వేయలేదని, పంచాయతీల అభివృద్ధి నిధులను దారి మళ్ళించారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి జే టాక్స్ పేరుతో రాష్ట్రానికి వచ్చిన కంపెనీలను తరిమేసారని, నాసిరకం మద్యంతో గవర్నమెంట్ మద్యం షాపు లు నిర్వహించి ప్రజల ప్రాణాలు బలి తీసుకున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి వేసిన చెత్త పన్ను రద్దుచేసి, అదే చెత్తతో సంపద సృష్టించగలమని తెలియజేసిన నేత నారా చంద్రబాబునాయుడు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని, త్వరలో మహిళల కోసం ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రైతులకు పెట్టుబడి సహాయం కింద అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నగదు అందజేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రియతమ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కి పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు ఘన స్వాగతం పలుకుతూ గుర్రంపై ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు పూరిమిట్ల గురునాథం, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య, పార్టీ నాయకులు నాయబ్ రసూల్, రామిశెట్టి మాలకొండయ్య, డాక్టర్ నరసింహారావు, కరిముల్లా, రఫీ, హిదయతుల్ల, ధనం మధు, కొండలరావు, సురేంద్ర, కంకణాల సుబ్బులనాయుడు, యాల్లవులు మాధవ, రాఘవ. పద్మారావు, అశోక్, వంకాయలపాటి మాల్యాద్రి, సోంపల్లి మనోహర్, అడపా రంగయ్య, బ్రహ్మారెడ్డి మండల అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

**సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ**



**కందుకూరు పెన్ పవర్, జూలై 29**

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ అన్నారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీ-కాన్సెప్షన్ అండ్ ప్రీ-నాటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ చట్టం లో భాగంగా ప్రినేటల్ డయాగ్నస్టిక్ పద్ధతులను నియంత్రించడం ద్వారా ఆడ భ్రూణ హత్యలను నిరోధించడం చట్టం కింద కొన్ని కీలక మార్గదర్శకాలు గురించి కీలక నిబంధనలు తెలియచేశారు. జన్యు ప్రయోగశాలలు, క్లినిక్‌లు మరియు అల్ట్రాసౌండ్ కేంద్రాలు పిసిపి ఎన్డిటి చట్టంలోని నియమం 8 ప్రకారం ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి తమ రిజిస్ట్రేషన్‌ను నమోదు చేసుకోవాలి పునరుద్ధరించాలి. ఈ కేంద్రాలు చట్టంలోని నియమం 9(8) ప్రకారం నిర్వహించిన విధానాలు పరీక్షల వివరణాత్మక రికార్డులను నిర్వహించాలి మరియు తగిన అధికారులకు నెలవారీ నివేదికలను సమర్పించాలి. పిసిపి ఎన్డిటి చట్టంలోని నియమం 18ఏ (6) ప్రకారం ప్రభుత్వానికి త్రైమాసిక నివేదికలను సమర్పించాలి అని అన్నారు. పిసిపి ఎన్డిటి చట్టం లింగ నిర్ధారణ ఆడ భ్రూణ హత్యలను నిరోధించడం, సమతుల్య లింగ నిష్పత్తిని ప్రోత్సహించడం ఆడపిల్లల హక్కులను రక్షించడం లక్ష్యంగా పెట్టుకుంది అని తెలియ చేసారు. పై చట్టాలను ఎవరు ఉల్లంఘించిన వారి పై చట్టప్రకారము చర్యలు తీసుకోమని పోలీస్ వారికి తెలియ చేసినారు. కార్యక్రమం లో ఈ కమీటీ కన్వీనర్ డాక్టర్ పద్మజ ,డాక్టర్ కొండయ్య, డాక్టర్ హరికృష్ణ ప్రసాద్ , డాక్టర్ బ్యుల గ్రేస్, సామాజిక ఆరోగ్య అధికారి శ్రీనివాసులు ,స్థానిక పట్టణ ఎస్సై శివ నాగరాజు, ప్రభు కుమారి, పద్మావతి పాల్గొన్నారు.

# ఎస్సీ కమీషన్ చైర్మన్ జవహర్‌కు శుభాకాంక్షలు

**తెదేపా అధికార ప్రతినిధి గోచిపాతల మోషే**

**కందుకూరు పెన్ పవర్, జూలై 29:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ కె ఎస్ జవహర్ ను విజయవాడ కార్పొరేషన్ పరిధిలోని ఎస్సీ కమీషన్ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించిన అనంతరం శుభాకాంక్షలు తెలియజేసినట్లు నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని దళితులపై దాడులు , దౌర్జన్యాలు , బలవంతంగా భూములు లాక్కోవడం వంటివి జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని చైర్మన్ ను మోషే కోరగా సానుకూలంగా స్పందించిన చైర్మన్ జవహర్ దళితులపై దాడులు , దౌర్జన్యాలు , బలవంతంగా భూములు లాక్కోవడం వంటివి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడ జరిగిన కమీషన్ కు సమాచారం ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హామీ ఇచ్చినట్లు మోషే మీడియాకు తెలియజేశారు. చైర్మన్ ను కలిసిన వారిలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోన ప్రతాప్ కుమార్ , ఉలవపాడు మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు ఆలూరి ఆనందరావు , తగరం సురేష్ తదితరులు ఉన్నారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# అన్నా క్యాంటీన్‌కు లక్ష విరాళం అందించిన దాతలు

**భట్టిప్రోలు, పెన్ పవర్ జులై, 29**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న క్యాంటీన్ ల నిర్వహణకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు అన్నారు.భట్టిప్రోలు మండలంలోని ఐలవరం గ్రామానికి చెందిన మాచర్ల శివ భాస్కరరావు అన్నా క్యాంటీన్ల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వానికి లక్ష రూపాయలు నగదు చెక్కును ఎమ్మెల్యేకు ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాచర్ల నాగరాజు, దీపాల శివప్రసాద్, వామనపల్లి కోటేశ్వరరావు పలువురు గ్రామస్తులున్నారు.



పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

# పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ

## విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్
## ప్రైవేటుకు ధీటుగా మరింత
## నాణ్యమైన విద్యను అందిస్తాం
## పీ4 పథకం అంటే
## బడుగులకు గొడుగు వంటిదే

**పెన్ పవర్, జులై 29, అద్దంకి**







ప్రైవేటు పాఠశాల ల కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అన్ని విభాగాల్లోనూ అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తుందని విధ్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిధిలోని కొరిశపాడు మండలంలోని తిమ్మనపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సుమారు 131 మంది విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలతో పాటు విద్యార్థులతోనూ మంత్రి మాట్లాడారు. పుస్తకాలు, యూనిఫాంతో పాటు మధ్యాహ్న భోజనం నాణ్యతపై పలువురిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు సంబంధించి ఇంకా ఏమైనా అవసరాలు ఉన్నాయా అంటూ విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలకు ప్రహరీ గోడతో పాటు పాత భవనం స్థానంలో కొత్తది కావాలంటూ కొందరు మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. వీటిపై మంత్రి గొట్టిపాటి సానుకూలంగా స్పందించారు. ప్రహరీ గోడతో పాటు పాఠశాలకు నూతన భవనాన్నిఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పాఠశాల వరకు తారు రోడ్డు వేయిస్తామని చెప్పారు. అనంతరం గ్రామ స్థాయిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను మంత్రి సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూస్తున్నామని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. పోటీతత్వంతో కూడిన నాణ్యమైన విద్యను అందించేలా, మంచి వాతావరణం ఉండేలా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నామని వెల్లడించారు. దూర ప్రాంత విద్యార్థులు డ్రాప్ అవుట్స్ కాకుండా సైకిళ్లను అందిస్తున్నామని తెలిపారు. పేరెంట్స్, టీచర్స్ కమిటీ కూడా పాఠశాల పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలన్నారు. అదే విధంగా గ్రామ పెద్దలు కూడా అప్పుడప్పుడూ పాఠశాలలకు వచ్చి మధ్యాహ్న భోజనం చేయాలని సూచించారు. పీ4 పథకం ద్వారా సమాజంలో సమూల మార్పుల వస్తాయని మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. అట్టడుగు వర్గాల వారికి, ఆర్థిక బలహీనులకు సహాయం చేసేందుకు ఉన్నత వర్గాల వారు, స్వచ్ఛంధ సంస్థలు ముందుకు రావాలని మంత్రి గొట్టిపాటి పిలుపునిచ్చారు. విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అందించిన కేసీ పుల్లయ్య ఫౌండేషన్ నిర్వాహకులను, అసిస్ట్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

**ముంపు గ్రామాల సమస్యలను పరిష్కరిస్తాం**

గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు గ్రామాలపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయరాణి తో కలిసి కొరిశపాడు మండలంలోని తిమ్మనపాలెం గ్రామంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమీక్ష నిర్వహించారు. పునరావాస కాలనీలలో పెండింగ్ లో ఉన్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మణికేశ్వరం ఎస్సీ కాలనీల నివేశ స్థలాల కేటాయింపు ప్రక్రియ గురించి ఆరా తీశారు. భూములు ఇచ్చిన రైతులకు మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటీవల రూ. 13 కోట్ల నిధులు మంజూరు చేసిన విషయాన్ని కేటాయింపులు చేశామని పనులు ప్రారంభించాలని యస్.డి.సి ను ఆదేశించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు గ్రామాల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు.

# బాపట్ల ప్రగతి..! సిఎస్‌కు వినతి..!!

## రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్‌ను కలిసిన బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జులై 29:**

బాపట్ల ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ ను కలసి విన్నవించినట్లు బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ తెలిపారు. బాపట్ల పర్యటనకు వచ్చిన విజయానంద్ ను ఎమ్మెల్యే నరేంద్ర వర్మ బాపట్ల కలెక్టరేట్ లో కలుసుకున్నారు. వివిధ అంశాలపై సిఎస్ తో చర్చించారు. బాపట్ల ప్రగతికి తీసుకోవాల్సిన అంశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బాపట్ల అభివృద్ధి ప్రణాళికకు సంబంధించి ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. వ్యవసాయ రంగంలో ఎత్తిపోతల పథకాల ఆవశ్యకతను సీఎస్ కు వివరించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పలుచోట్ల ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు విషయాన్ని సిఎస్ తో చర్చించినట్లు తెలిపారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న బాపట్ల సూర్యలంకను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు అవసరమైన సహకారాన్ని అందజేయాలని సిఎస్ ను కోరినట్లు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ విలేకరులకు తెలిపారు. పాండురంగపురం నుండి ఓడరేవు వరకు అభివృద్ధి చెందే అవకాశాలపై ప్రధాన దృష్టి సారించాలని కోరినట్లు నరేంద్ర వర్మ తెలిపారు. ఇదే సందర్భంలో ఎత్తిపోతల పథకాలకు అవసరమైన ట్రాన్స్ ఫార్మర్ల విషయంలో స్పందించాలని కోరారు. వ్యవసాయ రంగంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా అవసరమైన సహకారాన్ని అందించాలని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ కోరారు. బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలంలోని కట్టావాద రైతుల ఆందోళనను ఎమ్మెల్యే నరేంద్ర వర్మ సిఎస్ దృష్టికి తీసుకెళ్లారు. ట్రాన్స్ ఫార్మర్ లేకపోవడంతో అక్కడి రైతుల ఆందోళనను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సముద్ర తీర ప్రాంత గ్రామాల్లో 800 ఎకరాలకు సాగునీరు అందించే కట్టవాద వంటకాలువకు అవసరమైన విద్యుత్ ను అందించేందుకు సహకరించాలని కోరారు. అటవీ శాఖ సంరక్షణలో ఉన్న భూమిని పర్యాటక శాఖకు కేటాయించాలని కోరారు. దీనివల్ల బాపట్ల సూర్యలంక పర్యాటక కేంద్రం అద్భుతంగా ఆవిష్కృతమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే సూర్యలంక అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున స్పందించిందని తెలిపారు. 97 కోట్ల రూపాయల మేర ఈ ప్రాంత అభివృద్ధికి కేటాయించినట్లు వెల్లడించారు. సూర్యలంక తీరం మరింత అభివృద్ధి చెందే పుష్కలమైన అవకాశాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని ఈ తీరాన్ని ఒక అద్భుతమైన మణిహారంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. తాను చేసిన ప్రతిపాదనలపై సిఎస్ విజయానంద్ సానుకూలంగా స్పందించారని అన్నారు. భవిష్యత్తులో తన ప్రతిపాదనలు అన్ని అమలు జరిగే అవకాశం ఉందని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



# ఆటో కార్మికులు సంఘటితంగా పోరాడాలి

**భట్టిప్రోలు, పెన్ పవర్ జూలై, 29:**






మోటారు వాహన డ్రైవర్ల పై పెను భారాలను మోపేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా ఆటో కార్మికులు సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు పిలుపునిచ్చారు. భట్టిప్రోలు మెయిన్ బస్టాండ్ వద్ద శ్రీ లక్ష్మి గణపతి ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (ఎఐటియుసి) నూతనంగా నిర్మించిన యూనియన్ జండా దిమ్మె ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సభకు యూనియన్ అధ్యక్షులు కట్టా వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. నాగాంజనేయులు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కేంద్రాలు బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులపై తనుభారాలను మోపుతూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని ఆయన ఆరోపించారు. గతంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఆటోలను కొనుగోలు చేసుకునేందుకు సబ్సిడీ ద్వారా రుణాలు మంజూరు చేయటం జరిగేదని గత ఆరు సంవత్సరాలు గా ఆయా కార్పొరేషన్ ద్వారా ఎలాంటి రుణాలను మంజూరు చేయకపోవుట పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రైవేట్ ట్రావెల్స్ వారు బస్సులు కొనుగోలు చేసుకునేందుకు 95శాతం రుణాలను మంజూరు చేస్తున్న పాలక ప్రభుత్వాలు ఆటో కార్మికులకు రుణాలు మంజూరు చేయకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.రానున్న రోజుల్లో ఆటో కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని నాగాంజనేయులు కోరారు.ఏఐటీయూసీ రేపల్లె ఏరియా గౌరవ అధ్యక్షులు గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే ఆటో డ్రైవర్లకు వ్యక్తిగత ప్రమాద చంద్రన్న బీమా పాలసీని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతామని,డ్రైవర్ కుటుంబ సభ్యులకు ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ 25 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం గడిచిపోయినప్పటికీ హామీలను అమలు చేయకుండా కార్మికులను మోసం చేసిందని ఆయన విమర్శించారు.ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని బాలాజీ డిమాండ్ చేశారు.తొలుత ఏఐటియుసి పతాకాన్ని కట్టా సుబ్బారావు ఆవిష్కరించారు.ఈ సభలో ఏఐటియుసి వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు బండారు శ్రీనివాసరావు,ఆటో యూనియన్ నాయకులు నాగూర్ మీరా,జగన్నాథం వెంకటేశ్వరరావు, పీటర్ పాల్,కట్టా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్‌లో అక్రమాలపై లైఫ్ మెంబర్ ఫిర్యాదు

## కొండిశెట్టి సురేష్ బాబు.

**పెన్ పవర్, గుంటూరు, జులై.29.**




ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కృష్ణా జిల్లా శాఖలో జరిగిన అనేక అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఇంచార్జి కలెక్టర్ గీతాంజలి శర్మకు గుడివాడ వాస్తవ్యులు మరియు రెడ్‌క్రాస్ లైఫ్ మెంబర్ కొండిశెట్టి సురేష్ బాబు అర్జీ సమర్పించారు. 2022 నుంచి 2025 మార్చి వరకు జిల్లాశాఖలో జరిగే అన్ని లావాదేవీలు, జమలు, ఖర్చులు, జీతభత్యాలు ఒక్కటే ఖాతా ద్వారా నిర్వహించడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దాతల సహాయాలు, సభ్యుల నమోదు వంటి అంశాలు స్పష్టమైన విధానాల ప్రకారం జరగాల్సిన సమయంలో అవి నిబంధనలకు విరుద్ధంగా, అసంబద్ధంగా నిర్వహించబడ్డాయని ఆరోపించారు. ఇప్పటికే జిల్లా అధికారులకు సమాచారం అందించినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. కొంతమంది ఉన్నతాధికారులు అండదండలతోనే ఈ లోపాలు కొనసాగుతున్నాయని పలువురు లైఫ్ సభ్యుల అభిప్రాయంగా ఉందని వెల్లడించారు. డాక్టర్ పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఖాతాను జిల్లా ప్రధాన ఖాతాలో విలీనం చేయడం ద్వారా ఆర్థిక విషయాలలో మిస్మేనేజ్మెంట్ పెరిగిందని, దాంతో నష్టాలను చూపిస్తూ బ్లడ్ బ్యాంకును మూసివేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం ఉందన్నారు. ఇది ప్రజల ఆరోగ్య హక్కును తీవ్రంగా హరించడమేనని పేర్కొన్నారు. అంతేకాక, రెడ్‌క్రాస్ జనరల్ బాడీ మీటింగ్‌లో పాల్గొనాల్సిన సభ్యులను ప్రలోభపెట్టే ప్రయత్నాలపై కూడా గతంలో పత్రికల్లో వార్తలు వచ్చినప్పటికీ ఇప్పటివరకు అధికారులు స్పందించకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జరగాల్సిన జనరల్ బాడీ మీటింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసి, సంపూర్ణ స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య విలువలకు భంగం కలగకుండా, పారదర్శక పరిపాలనకు న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన వినతిలో స్పష్టంగా పేర్కొన్నారు.

## ఆర్‌విఎస్‌సివిఎస్ హై స్కూల్‌లో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా.సి.నారాయణరెడ్డి జయంతి కార్యక్రమం



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూలై 29 :**

చిలకలూరిపేట: పట్టణంలోని ఆర్ వి ఎస్ సి వి ఎస్ హై స్కూల్ లో సోమవారం జనవిజ్ఞానవేదిక మరియు లాలూ దాదా సాహెబ్ సేవాసమితి ఆధ్వర్యంలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా.సి.నారాయణరెడ్డి జయంతి కార్యక్రమం జరిగింది. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు తంగళ్ళ సుధాకర హరిప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు డా.పీవీ.సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. నారాయణరెడ్డి రాసిన కావ్యలగురించి ఆయన వివరించారు. ఆయనరాసిన గజళ్ళు, ప్రపంచ పదులు పాడి వినిపించారు. బాలసాహితీవేత్త జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డా దార్ల బుజ్జిబాబు మాట్లాడుతూ సి.నారాయణరెడ్డి 3వేలకు పైగా సినిమా పాటలు రాశారన్నారు. బాలగేయలు కూడా అనేకం రాశారన్నారు. తెలుగుజాతి మనది, భారత మాతకు జేజేలు వంటి దేశభక్తి పాటలు రాసి పిల్లల కు దేశభక్తి ఉద్బోధించారు. తొలుత సి.నారాయణ రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఇందులో భాగంగా పాఠశాల గ్రంథాలయానికి 3వేల రూపాయల విలువైన బాలసాహిత్య గ్రంథాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో లాలూ దాదా సాహెబ్ సేవాసమితి అధ్యక్షులు షేక్ సిద్ధాంతి కరిముల్లా, ఆర్యవైశ్య కళ్యాణ మంటపం ప్రధాన కార్యదర్శి చేవూరి కృష్ణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యాన్ని కాపాడుకునేందుకు.ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేదం.కోవెలమూడి రవీంద్ర

**పెన్ పవర్, గుంటూరు, జులై 29**

గుంటూరు నగరాన్ని సుందర, పర్యావరణహిత నగరంగా, ప్రజారోగ్యాన్ని కాపాడుకునేందుకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకుండా వ్యాపార వాణిజ్య సంస్థలు, ప్రజలు ముందుకు రావాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆగస్ట్ 1 నుండి నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేదం అమలుపై చాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్స్, రెస్టారెంట్ల యజమానులు, కర్రీ పాయింట్స్, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వేడి ఆహార పదార్ధాలు ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేయడం వలన, వాటిని తినే ప్రజలకు క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాదులు సోకుతున్నాయని పలు నివేదికల్లో వస్తున్నందున గుంటూరు నగరంలో హోటల్స్, కర్రీ పాయింట్స్ నిర్వహకులు తప్పనిసరిగా ప్రత్యామ్నాయ ప్యాకింగ్ సంచుల వినియోగం చేయాలన్నారు. నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు కూడా నగరంలో ప్రధాన, అంతర్గత రోడ్ల వెంబడి విచ్చలవిడిగా, అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న ఆహార విక్రయ బండ్లపై వినియోగించే నూనె, ఇతర పదార్ధాలను తనిఖీ చేయాలన్నారు. వారు కూడా యధేచ్చగా ప్లాస్టిక్ సంచుల వినియోగం చేస్తున్నారని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి నెలలో స్టేక్ హోల్డర్స్, వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి, ఏప్రిల్ 1 నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదం అమలు చేస్తామని తెలియచేయగా, 3 నెలలు గడువు అడిగారన్నారు. అలాగే ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు





కూడా అక్టోబర్ 2 నాటికి ప్లాస్టిక్ రహితంగా నగరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారని,అ అందుకు తగిన విధంగా గుంటూరుని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం సంపూర్ణంగా నిషేదించిన నగరంగా తీర్చి దిద్దుకోవడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్ సూపర్ లీగ్ సిటీల్లో జాతీయ స్థాయిలో గుంటూరు నిలిచిందని, అలాగే రాష్ట్ర స్థాయిలో ప్రతి నెల చేపట్టే ఐవిఆర్ఎస్ సర్వేలో కూడా శానిటేషన్ విభాగంలో తొలి స్థానంలో నిలిచామని, ఆ స్థానాలు నిలబెట్టుకోవడం ప్రతి ఒక్కరి భాధ్యత అని అన్నారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పై ఇంటింటి అవగాహన కల్గిస్తామని, ప్రత్యేకంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ గూర్చి కరపత్రాలు, స్టిక్కర్లు అందిస్తామన్నారు. ప్రతి కమర్షియల్ సంస్థ తప్పనిసరిగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదం అమలులో ఉన్నందున క్యారీ బ్యాగ్స్ ఇవ్వబడవు అని బ్యానర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంతిమంగా నగరంలో ప్రజారోగ్యానికి, డ్రైన్లలో మురుగుపారుదలకు, పర్యావరణంకు హానీ కల్గిస్తున్న ప్లాస్టిక్ ని సమూలంగా నిషేదించాలని పిలుపునిచ్చారు. అనంతరం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదం అమలు చేస్తామని, చుట్టుపక్కల ప్రజలు, మిత్రులకు అవగాహన కల్గిస్తామని స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, బి.శ్రీనివాసరావు, ఇంచార్జి ఎంహెచ్ఓలు రామారావు, సోమశేఖర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు, హోటల్స్, రెస్టారెంట్స్, ప్రతినిధులు, ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకారణాల నిర్ధారణ



**భట్టిప్రోలు, పెన్ పవర్ జూలై, 29**

సమగ్ర శిక్ష,కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం(అలంకో) సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఉపకారణాల నిర్ధారణ శిబిరం ఎంపీపీ ఎస్ బి ఎఫ్ ఎస్ కొల్లూరు నందు ఈనెల 31వ తేదీ గురువారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించబడుతుందని మండల విద్యాశాఖ అధికారి నీలం దేవరాజ్ మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలల లో 18 సంవత్సరాలు లోపు వయసు గల విద్యార్థులు ఆధార్ కార్డ్,రేషన్ కార్డ్,సదరం సర్టిఫికెట్,కాస్ట్ సర్టిఫికెట్,రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలు తీసుకొని ఈ శిబిరమునకు హాజరు కావాలని వి.జ్ఞాన జ్యోతి మండల విద్యాశాఖ అధికారి (కొల్లూరు) తెలియజేశారన్నారు. భట్టిప్రోలు, కొల్లూరు,వేమూరు, అమృతలూరు,చుండూరు మండలాల లో గల ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

## చేయిచేయి కలుపుదాం చేయూతనిద్దాం.. ఎమ్మెల్యే నసీర్.



**పెన్ పవర్, గుంటూరు, జులై 29**

సమాజంలో మానవ సంబంధాలను మెరుగుపరిచి, ఆర్థిక అంతరాలను దూరం చేసే మహత్తర కార్యక్రమం పీ-4 అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నగరంలోని చార్టెర్డ్ అకౌంటెంట్స్, పెట్రోల్ బంకు యజమానులు, హోటల్స్ యజమానుల అసోసియేషన్లతో మంళవారం విడివిడిగా పీ-4పై సమావేశమయ్యారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మంగా రూపకల్పన చేసిన పీ-4 కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలవబోతోందని తెలిపారు. మానవత్వాన్ని మేల్కొలుపుతూ పేద వర్గాలను ఉన్నతంగా తీర్చిదిద్దే ఈ కార్యక్రమం గేమ్ ఛేంజర్ అని చెప్పారు. ప్రతి ఒక్కరూ మార్గదర్శకులుగా మారి బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని పిలుపునిచ్చారు. బంగారు కుటుంబాలకు ఆర్థికంగా మాత్రమే కాకుండా నైతికంగా మద్దతు ఇవ్వాలని చెప్పారు. విద్య, వైద్య పరంగా అండగా నిలవడం ద్వారా బంగారు కుటుంబాలను మెరుగైన స్థితికి తీసుకురావచ్చని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అత్యధికంగా 25 వేల బంగారు కుటుంబాలు ఉన్నాయని, అందరి జీవితాల్లో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని కోరారు.

## టిడ్కో ఇళ్లల్లో నివాసం ఉంటున్న ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు చేయాలి

**కమిషనర్ పులి శ్రీనివాసులు**



**పెన్ పవర్, గుంటూరు, జులై 29**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం టిడ్కో అధికారులతో నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అడవితక్కెల్లపాడు, వెంగళాయపాలెంలోని టిడ్కో ఇళ్లల్లో నివాసం ఉంటున్న ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. త్రాగునీటి, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి జిఎంసి, టిడ్కో అధికారులతో కలిసి పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నగరపాలక సంస్థ పిజిఆర్ఎస్ ఇతర వేదికల ద్వారా టిడ్కో ఇళ్లకు సంబంధించి ప్రజల నుండి పలు అర్జీలు అందుతున్నాయని, వాటిని టిడ్కో, జిఎంసి అధికారులు సమన్వయంతో పరిష్కారం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం నగర పరిధిలో కేటగిరిలు వారిగా టిడ్కో ఎన్ని గృహాలు మంజూరు అయ్యాయి, ఎంత మంది నివాసం ఉంటున్నారు, ప్రధాన సమస్యలపై టిడ్కో అధికారులు నివేదిక ఇవ్వాలన్నారు. పర్యటనలో టిడ్కో ఎస్ఈ ఉమామహేశ్వరశాస్త్రి, ఉపా సెల్ పిఓ జె.రామారావు, టిడ్కో డిఈఈ సేతుబాబు, టిడ్కో కోఆర్డినేటర్ సుధాకర్, ఏఈ వేణు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న చంద్రబాబు సంకల్పం..

### పట్టుదలతో జగన్ కు శిరోభారం, వైసీపీకి రాజకీయ సమాధే

*తాను చేసిన విధ్వంసాన్ని సరిచేస్తూనే, ఆర్థిక కష్టాలను అధిగమిస్తూ చంద్రబాబు ప్రజలు మెచ్చేలా పాలన చేయడాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నాడు: ప్రత్తిపాటి.*

*మానసిక రోగం ఎక్కువయ్యే చివరకు చంద్రబాబు సింగపూర్ పర్యటనపై దుష్ప్రచారం చేసే స్థితికి జగన్ దిగజారాడు : ప్రత్తిపాటి*

*ఏపీ ప్రభుత్వంతో సింగపూర్లోని ప్రతిష్టాత్మక సంస్థలు చేసుకుంటున్న ఒప్పదాలు..*

*ఆ దేశ ప్రభుత్వ పెద్దలు, పారిశ్రామికవేత్తల సానుకూలత జగన్ కు కనిపించడం లేదా?*



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూలై 29 :**

అసలు ఎప్పటికీ, ఎవరూ బాగుచేయని విధంగా రాష్ట్రాన్ని తాము నాశనం చేసినా.. చంద్రబాబు, కూటమిప్రభుత్వం తిరిగి ఏపీ పునర్నిర్మాణం దిశగా వడివడిగా అడుగులు వేయడాన్ని జగన్ అండ్ కో జీర్ణించుకోలేకపోతున్నారు. తాము సృష్టించిన ఆర్థికలోటును భర్తీ చేస్తూ, ప్రజలు మెచ్చేలా సంక్షేమపథకాలు అందిస్తూ, మరోవైపు రాష్ట్రాభివృద్ధికి కీలకమైన పెట్టుబడులు సాధించేందుకు, కంపెనీలను ఆకర్షించేందుకు చంద్రబాబు రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తుండటాన్ని జగన్ భరించలేకపోతున్నాడు. తనకున్న మానసిక రోగం రోజురోజుకీ ఎక్కువైపోతూ, ఆయన ప్రశాంతంగా ఉండలేకపోతున్నాడు. ఆ భరించలేని ప్రవర్తనతోనే చంద్రబాబు గొప్ప సదుద్దేశంతో చేపట్టిన సింగపూర్ పర్యటనపై తన అవినీతి మీడియాలో, వైసీపీవారితో బురద జల్లిస్తున్నాడు. చంద్రబాబు కృషి ఫలించి, సింగపూర్ పర్యటన ఫలప్రదమై రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే ప్రజలు తన కుట్ర రాజకీయాలను నమ్మరన్న దుర్బుద్ధితోనే జగన్ దుష్ప్రచారానికి తెగబడ్డాడు. సింగపూర్ ప్రభుత్వం, ఆ దేశ పారిశ్రామికవేత్తలు, వ్యాపారదిగ్గజాలు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు వెల్లడించే అంశాలు, రాష్ట్రంలోని అవకాశాలు, వనరుల వినియోగంపై పూర్తి సానుకూలత వ్యక్తం చేస్తూండటం నిజంగా రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి శుభసూచకమైతే, జగన్ కు, వైసీపీకి మాత్రం మింగుడుపడని అంశం.

**జగన్ కు శిరోభారం... వైసీపీకి రాజకీయ సమాధి....**

జగన్ ఎన్ని కుట్రలుచేసినా.. కుయుక్తులు పన్నినా గత ఎన్నికలలో ప్రజలు ఆయన్ని నమ్మలేదు. ఐదేళ్ల రాక్షసపాలనకు అంతంపలికి భారీ మెజారిటీతో కూటమిపార్టీలను గెలిపించి, జగన్ ను కేవలం 11 స్థానాలకే పరిమితం చేశారు. ప్రజలు పచ్చగా ఉంటే, రాష్ట్రం సుభిక్షంగా ఉంటే చూసి తట్టుకోలేని తన విపరీత మనస్తత్వం తనకే చేటు చేస్తుందని జగన్ గ్రహించలేకపోతున్నాడు. చంద్రబాబు సంకల్పం, పట్టుదల ముందు జగన్ దుర్మార్గపు రాజకీయం నిలవదు. రాష్ట్రాభివృద్ధే తన లక్ష్యంగా.... ప్రజల కష్టాల తొలగింపే ధ్యేయంగా అకుంఠిత దీక్షతో ముందుకు సాగుతున్న చంద్రబాబును ఎవరూ అడ్డుకోలేరు. కూటమిప్రభుత్వం ఏడాదిలో అందించిన సుపరిపాలనతోనే జగన్ కు ఏకధారగా కన్నీళ్లు వస్తున్నాయి. మిగిలిన నాలుగేళ్లలో చంద్రబాబు చేసే అభివృద్ధి.. ప్రజలకు అందించే విలువైన సంక్షేమంతో జగన్ కు భరించలేని శిరోభారం, ఆయన పార్టీ రాజకీయంగా సమాధి కావడం తథ్యం. అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో స్పష్టంచేశారు.

# పంటల భీమా చేయించండి

### పోట్ల నరసింహారావు, మండల వ్యవసాయాధికారి

**పెన్ పవర్ కారంపూడి జులై 29::**



31 వ తారీఖుతో పంటల భీమా గడువు ముగుస్తున్నందున రైతులందరూ వెంటనే పంటల భీమా కొరకు నమోదు చేసుకోవాలని కోరారు. ఈరోజు ఒప్పిచర్ల లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతూ మండలంలోని పంటలు సాగుచేసే రైతులందరూ వెంటనే పంటలభీమా చేయించుకోవాలని తెలిపారు. దీనికి రైతులుల మిరప పంటకు-360 చెల్లిస్తే - భీమా పరిహారం 90000, కందులు - 40 చెల్లిస్తే - భీమా పరిహారం 20000. వరి పంటకు - 80 - చెల్లిస్తే భీమా పరిహారం 40000. ప్రత్తి పంట కు ఎకరానికి కట్టాల్సిన ప్రీమియం 1900/- .... భీమా పరిహారం %ష్టరీ. 38000/- భీమా అందించడం జరుగుతున్నది. భీమా చెల్లించవలసిన చివరి తేదీ జూలై 31 (ప్రత్తి, మిరప మరియు కందులు), వరి పంటకు చివరి తేదీ ఆగష్టు 15. దరఖాస్తు చేసుకోవడానికి కావలసిన పత్రాలు: పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, పంట నమోదు ధ్రువీకరణ పత్రం, కౌలు రైతుదారులకు కౌలు రైతు కార్డు. ఈ కావున ఈ పథకాన్ని అందరూ వినియోగించుకోవాల్సిందిగా కోరడమైనది.ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాన్ని రైతులు నమ్మవద్దు.

**-ఏవో. బ్రహ్మారెడ్డి**



**భట్టి ప్రోలు, పెన్ పవర్ జులై, 29:**

భట్టిప్రోలు మండల పరిధి లో యురియా కొరత అంటూ వస్తున్న అసత్య ప్రచారాలను రైతులు నమ్మవద్దని మండల వ్యవసాయ అధికారి బి.బ్రహ్మారెడ్డి మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని మొత్తం18 ఎరువుల దుకాణాలు ఉన్నాయన్నారు. ఆయా దుకాణాలలో యూరియా 530.405 టన్నులు,డి.ఎ.పి. 296.5 టన్నులు మరియు కాంప్లెక్స్ 216.2 టన్నుల నిల్వలు ఉన్నాయని తెలిపారు.ఇంకా మండలం లోని రైతుల అవసరాల మేరకు యురియా 120 టన్నులు,డిఏపి 80 టన్నులు ఇండెంట్ ను పెట్టడం జరిగిందన్నారు.కావున రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. ఎవరైనా,ఏ దుకాణంలోనైనా యూరియా ఎక్కువ ధరలకు అమ్ముతున్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని వ్యవసాయ అధికారి బ్రహ్మారెడ్డి కోరారు.

## రాష్ట్ర గ్రంధాయ పరిషత్ డైరెక్టర్ గా.పద్మజ



**పెన్ పవర్, గుంటూరు, జులై.29**

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ గా గుంటూరు నలంద నగర్ కు చెందిన మగతాల పద్మజను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరుకు చెందిన పద్మజ జయహో నవ్యాంధ్ర పుస్తకాన్ని ఆమె రచించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములుగా చేస్తేనే అభివృద్ధి క్షేత్రస్థాయిలో అందుబాటులోకి చేరుతుందని ఆమె అన్నారు. ఈ పుస్తకాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రెండేళ్ల క్రితం ఆవిష్కరించారు. పద్మజ 23 నుంచి నరసరావుపేటలో విద్యా వికాస్ అని పాఠశాలను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా గ్రంథాలయాల ద్వారా ప్రజలను ప్రభుత్వ కార్యక్రమాలను భాగస్వాములు చేయవచ్చని చెప్పారు. తనుకు డైరెక్టర్ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, శాసనసభ్యులు మాధవి, గ్రంధాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పద్మజా తండ్రి విశ్రాంత తాసిల్దారు లక్ష్మయ్య.

# బాయ్ ఫ్రెండ్ ని కిడ్నాప్ చేయించిన గర్ల్ ఫ్రెండ్... డిమాండ్ తెలిస్తే షాకే!




**హైదరాబాద్  పెన్ పవర్:** ప్రియుడి కోసం కట్టుకున్న భర్తలకు కడతేర్చుతున్న భార్యలకు సంబంధించిన ఘటనలు వరుసగా హల్ చల్ చేస్తోన్న వేళ.. తాజాగా డబ్బుల కోసం బాయ్ ఫ్రెండ్ ను కిడ్నాప్ చేయించి, చిత్ర హింసలకు గురించేసి, అతడి కుటుంబ సభ్యులకు కాల్ చేసి పెద్ద మొత్తంలో నగదు డిమాండ్ చేసిన గర్ల్ ఫ్రెండ్ వ్యవహారం తాజాగా తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో.. ఈ స్క్రిప్ట్ మామూలుగా లేదనే మాటలు వినిపిస్తున్నాయి.అవును... డబ్బు కోసం ఓ మహిళ తన బాయ్ ఫ్రెండ్ ను కిడ్నాప్ చేయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. దుబాయ్ కు చెందిన ఓ ట్రావెల్ సంస్థకు మేనేజర్ గా పని చేస్తున్న లారెన్స్ మెల్విన్ ను అతడి గర్ల్ ఫ్రెండ్ మహిమావత్ ఇటీవల బెంగళూరులో కిడ్నాప్ చేయించింది. అనంతరం రూ. 2.5 కోట్లు డిమాండ్ చేసింది. దీంతో... అతడి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.
వివరాల్లోకి వెళ్తే... దుబాయ్ కు చెందిన ట్రావెల్ సంస్థలో మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న లారెన్స్ మెల్విన్ (37).. ఇటీవల తన కుటుంబ సభ్యులు నివసిస్తున్న బెంగళూరుకు వచ్చారు. ఈ క్రమంలో... జులై 16 నుంచి తమ కుమారుడు కనిపించట్లేదని లారెన్స్ తల్లి అశోక్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సమయంలో... కిడ్నాపర్లు ఫోన్ చేసి రూ. 2.5 కోట్లు ఇవ్వాలని బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు!
దీంతో.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. అతడి గర్ల్ ఫ్రెండ్ ఈ కిడ్నాప్ కు పథకాన్ని రచించిందని గుర్తించారు. ఈ సందర్భంగా... సెలవుపై దుబాయ్ నుంచి బెంగళూరు వచ్చిన లారెన్స్.. రెసిడెన్సీ రోడ్ లోని ఒక హోటల్ లో బస చేశారని.. ఈ క్రమంలో జులై 14న అతడి ప్రియురాలు మహిమా బయటకు వెళ్దామని ఆహ్వానించడంతో ఓ కారు బుక్ చేసుకొని వెళ్లారని పోలీసులు తెలిపారు.
ఈ సమయంలో... కొంతదూరం వెళ్లిన తర్వాత, డ్రైవర్ కారును మరో మార్గంలో తీసుకువెళ్లగా అక్కడ మరో ఇద్దరు వ్యక్తులు కారులోకి ఎక్కి లారెన్స్ పై దాడి చేశారని.. అతడి వద్ద ఉన్న రూ.లక్ష నగదు లాక్కొని ఓ అపార్ట్ మెంట్ లో బంధించారని తెలిపారు. ఈ క్రమంలో సుమారు వారం రోజులకు పైగా అతడిని చిత్రహింసలకు గురి చేసినట్లు వెల్లడించారు.అనంతరం.. అతడి కుటుంబ సభ్యులకు కాల్ చేసిన దుండగులు.. రూ. 2.5 కోట్లు డిమాండ్ చేశారని.. అయితే, అదే అపార్ట్‌మెంట్ లో ఉంటున్న ఓ మహిళ నిందితుల తీరు అనుమానాస్పదంగా ఉండడం గమనించి.. వారు లేని సమయంలో బాధితుడిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించిందని తెలిపారు.ఆ సమాచారంతో స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లారెన్స్ ను రక్షించారు. ఈ క్రమంలో.. ఆర్‌టి నగర్ కు చెందిన మహ్మద్ ఆసిఫ్ రిసల్దార్ (42), మహ్మద్ సోహైల్ షేక్ (25), డిజె హళ్లికి చెందిన సల్మాన్ పాషా (22), కెజి హళ్లికి చెందిన మహ్మద్ నవాజ్ (27) లను అదుపులోకి తీసుకోగా... మహిమా సహా మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

# 11 లక్షల మంది మహిళల ప్రైవేట్ చాట్ లీక్... ఏమిటీ యాప్..!




**హైదరాబాద్  పెన్ పవర్:** పురుషుల గురించిన సమాచారాన్ని పంచుకోవడానికి, మహిళలకు సురక్షితమైన స్థలాన్ని అందించడానికి ఉద్దేశించినట్లు చెప్పే “టీ” డేటింగ్ యాప్ మరో తీవ్రమైన డేటా ఉల్లంఘనకు గురైందనే విషయం తాజాగా సంచలనంగా మారింది! తాజాగా వెలుగులోకి వచ్చిన ఒక నివేదిక ప్రకారం.. సుమారు 11 లక్షల మంది మహిళలకు సంబంధించిన అత్యంత వ్యక్తిగత మెసేజ్ లు, సెల్ఫీలు ఆన్ లైన్ లో బహిర్గతమయ్యాయి.
అవును... మహిళలు తమకు నచ్చిన విషయాలు షేర్ చేసుకునేలా రూపొందించిన టీ డేటింగ్ యాప్ లో గోప్యతా ఉల్లంఘనలు బయటపడ్డాయని తెలుస్తోంది. ఈ సందర్భంగా... 11 లక్షల మంది యూజర్ల మధ్య జరిగిన ప్రైవేటు మెసేజ్ లు ఆన్ లైన్ లో ప్రత్యక్షమయ్యాయని ఓ మీడియా కథనం పేర్కొంది. వాటిలో అత్యంత వ్యక్తిగతమైన, మరింత సున్నితమైన సమాచారం ఉందని ఆ కథనం వెల్లడించింది.
ఈ సందర్భంగా... తాజా ఉల్లంఘనల్లో 2023 నుంచి ఉన్న మెసేజ్ లు కూడా ఉన్నాయని ఆ కథనం పేర్కొగా.. అందులో కొందరు మహిళలు అబార్షన్, రిలేషన్ షిప్ సమస్యలను చర్చించుకున్నారని తెలిపింది. ఇక... ఈ యాప్ లో నకిలీ పేర్లు వాడే వెసులుబాటు ఉన్నప్పటికీ.. చాలామంది యూజర్లు తమ గుర్తింపు తెలియజేసే వివరాలను ఉపయోగించారని అంటున్నారు.దానికి ప్రధాన కారణం.. తమ పర్సనల్ ఇష్యూస్ గోప్యంగా ఉంటాయని నమ్మడమే అని అంటున్నారు. ప్రస్తుతం టీ యాప్ కు 16 లక్షల మంది యూజర్లు ఉండగా... మహిళలు మాత్రమే ఈ యాప్ లో చేరేలా వారి సెల్ఫీలతో కన్ ఫాం చేసుకుంటారు. ఈ ఫీచర్ వల్లే మహిళలు దీనిపై ప్రత్యేకంగా ఆకర్షితులయ్యారని చెబుతారు.అయితే... వరుసగా జరిగిన గోప్యతా ఉల్లంఘనల వల్ల యూజర్ల సమాచారాన్ని భద్రపరిచే సామర్థ్యంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో... ఈ సమస్యను కనుగొన్న సైబర్ సెక్యూరిటీ పరిశోధకురాలు కస్రా రహ్జెర్డి.. యాప్ లో వినియోగదారుల పేర్లు ఇప్పటికీ యాక్టివ్ గా ఉన్నాయని నిర్ధారించింది.ఈ నేపథ్యంలో.. ఈ వ్యవహారాలపై ‘టీ’ నిర్వాహకులు స్పందించారు. ఈ సందర్భంగా... ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలను ఇప్పటికే ప్రారంభించినట్లు చెప్పారు. ఇదే సమయంలో... సైబర్ సెక్యూరిటీ నిపుణులతోనూ తాము విచారణ చేయిస్తున్నామని.. అలాగే భద్రతా సంస్థలు జరిపే దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నామని తెలిపారు.

# నాగ పంచమి రోజు మాత్రమే తెరుచుకునే ఉజ్జయిని శ్రీ నాగ చంద్రేశ్వర ఆలయం



**హైదరాబాద్  పెన్ పవర్:** భారతదేశం.. దేవాలయాలకు.. పుణ్య క్షేత్రాలకు ప్రసిద్ధి.  ప్రతి దేవాలయానికి ఒక చరిత్ర ఉంది. సాధారణంగా భారతదేశంలోని గుళ్లలో నిత్యం పూజలు చేస్తారు.  కాని మధ్య ప్రదేశ్? లోని ఓ దేవాలయం మాత్రం ఏడాదికి ఒక్కరోజే తెరుస్తారు.  శ్రావణమాసంశుక్ల పక్షం పంచమి తిథి రోజున అంటే నాగ పంచమి రోజు తెరిచి ఘనంగా నాగేంద్రస్వామికి ఘనంగా పూజలు చేస్తారు.. ఏడాదిలో ఒక్కరోజే ఓపెన్? చేసే దేవాలయం గురించి ఇప్పుడు తెలుసుకుందాం. . .
మధ్యప్రదేశ్ ఉజ్జయినిలోని శ్రీ నాగ చంద్రేశ్వర ఆలయం ఏడాదిలో ఒక్కరోజే మాత్రమే తెరుస్తారు. నాగుల పంచమికి ముందు రోజు రాత్రి 12 గంటలకు తెరిచి, పంచమి రోజు రాత్రి 12 గంటలకు మూసివేస్తారు. శేషతల్పంపై శివపార్వతులు ఉన్న ఏకైక ఆలయమిది. ఆలయంలో పాములు సంచరిస్తాయని, తక్షకుడు ఇక్కడ తపస్సు చేశాడని భక్తుల నమ్మకం. ఈ ఏడాది జులై 29న అంటే నేడు నాగులపంచమి సందర్భంగా నాగచంద్రేశ్వర ఆలయాన్ని భక్తుల దర్శనార్థం తెరిచారు.దేశవ్యాప్తంగా నాగ పంచమి పండుగను ఈ రోజు ( జులై 29) ఘనంగా జరుపుకున్నారు. భక్తులు అలయాలను దర్శించుకుని పుట్టలో పాలు పోస్తూ పూజలు చేశారు. నాగ పంచమి రోజును పురస్కరించుకుని ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ ఆలయం  తెరుచుకుంది. ఏడాదికి ఒకసారి మాత్రమే ఈ ఆలయం తలుపులు తెరుచుకుంటాయి. అది కూడా శ్రావణ మాసంలో వచ్చే నాగ పంచమి రోజు మాత్రమే. అందుకే ఈ ఏడాది నాగ పంచమికి ముందు అంటే ఈ ఏడాది జులై  28 వ తేదీ అర్థరాత్రి నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు నాగదేవతను దర్శించుకునేందుకు క్యూలైన్లలో నిలబడి పూజలు చేశారు.  మళ్లీ ఈ రోజు (జులై 29) అర్ధరాత్రి 12 గంటలకు మూసేస్తారు.  నాగ పంచమి నాడు నాగదేవతను పూజించడం వల్ల పాముకాటు భయం ఉండదని, జీవితంలోని కష్టాలన్నీ తొలగిపోతాయని నమ్మకం. ఈ రోజున ( జులై 29)  వాసుకి, మణిభద్ర, కాళిక, ధనంజయ, తక్షకుడు, కర్కోటకుడు మొదలైన వారిని పూజించే సంప్రదాయం ఉంది.
దేశంలోనే ప్రత్యేకమైన ఈ ఆలయ తలుపులు నాగ పంచమి రోజున సంవత్సరానికి ఒకసారి మాత్రమే తెరుచుకుంటాయి. అటువంటి పరిస్థితిలో ప్రతి సంవత్సరం నాగ పంచమికి ఒక రోజు ముందు అర్థరాత్రి నుండి ఆలయాన్ని సందర్శించడానికి ప్రజలు క్యూ కడతారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మహాకాళేశ్వర ఆలయంలో నాగపంచమి రోజున నాగచంద్రేశ్వరుని దర్శనం చాలా ప్రత్యేకమైనది.
జ్యోతిర్లింగాలలో ఒకటైన మహాకాళ ఆలయ సముదాయంలో చాలా పురాతనమైన నాగచంద్రేశ్వరుని ఆలయం ఉంది. ఈ ఆలయంలో పాముపై కూర్చున్న శివ-పార్వతి విగ్రహం చాలా అరుదైనది. ఆలయంలోని నాగచంద్రేశ్వరుని విగ్రహాన్ని దర్శించి పూజించడం ద్వారా శివపార్వతులిద్దరూ సంతోషిస్తారని, పాముల భయం నుండి విముక్తి లభిస్తుందని నమ్ముతారు.

**శేషనాగుపై శివపార్వతులు**

సాధారణంగా విష్ణుమూర్తి శేషనాగుపై శయనిస్తాడు. కానీ ఇక్కడ మాత్రం శివపార్వతులు శేషనాగు మీద శయనిస్తారు. వీరితో పాటు వినాయకుడు కూడా ఉంటాడు. ఈ విగ్రహం చాలా పురాతమైనది. ఇలాంటి విగ్రహం ప్రపంచంలో మరెక్కడా లేదు. నాగులకు రాజుగా భావించే తక్షకుడు ఈ ఆలయంలో నివసిస్తున్నాడని భక్తులు విశ్వసిస్తారు.
నాగపంచమి రోజు ఈ ఆలయాన్ని దర్శించుకోవడం వల్ల అన్ని దోషాలు తొలగిపోతాయని నమ్మకం. ఈ ఆలయాన్ని దర్శించుకున్న వారికి కాలసర్ప దోషం తొలగిపోతుందని పండితులు చెబుతున్నారు. ఈ ఒక్కరోజు మాత్రమే ఆలయం తెరిచి ఉంటుంది. . ఇక్కడ స్వామి వారిని దర్శించుకునేందుకు 24 గంటల సమయం మాత్రమే ఉండటం వల్ల భక్తులు లక్షల్లో వస్తారు. ఈఏడాది  జులై 28 న అర్ధరాత్రి పూజలు చేసి ఆలయ తలుపులు తెరిచారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులందరూ పాల్గొన్నారు. తలుపులు తెరిచిన అనంతరం నాగచంద్రేశ్వరునికి విధివిధానాల ప్రకారం పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈరోజు  ( జులై 29) ప్రజలు ఈ ఆలయంలో రోజంతా నాగచంద్రేశ్వరుని దర్శనం చేసుకుంటారు.

**దేవాలయ చరిత్ర**

పురాతన కాలంలో ఈ ప్రదేశాన్ని మహాకాళ వన అని పిలిచేవారు. తక్షకుడు అనే నాగు ఇక్కడ తపస్సు చేశాడని నమ్ముతారు. నేటికీ నాగచంద్ర దేవాలయంలో తక్షక్ నాగ్ నివసిస్తున్నాడని నమ్ముతారు. ఈ ఆలయానికి ఒక ప్రత్యేకత కూడా ఉంది. ఇక్కడ సందర్శిస్తే కాలసర్ప దోషం అశుభ ప్రభావాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

# సిగరెట్ తెచ్చివ్వలేదు.. అందుకే గొడవ- కల్పిక!



**హైదరాబాద్  పెన్ పవర్:** కల్పిక.. హీరోయిన్ ఫ్రెండ్ తరహా పాత్రలతో ఒక మోస్తరుగా గుర్తింపు తెచ్చుకున్న నటి. ప్రయాణం, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు లాంటి చిత్రాలు ఆమెకు పేరు తెచ్చిపెట్టాయి. ఐతే సినిమాల్లో వచ్చిన గుర్తింపు కంటే.. సోషల్ మీడియా ద్వారా ఆమెకు వచ్చిన పాపులారిటీనే ఎక్కువ. తరచుగా ఏదో ఒక వివాదంతో ఆమె వార్తల్లోకి వస్తుంటుంది. గతంలో తమిళ నటి ధన్య బాలకృష్ణన్‌తో కొన్ని రోజుల పాటు సోషల్ మీడియా ద్వారా తీవ్ర స్థాయిలో ఘర్షణకు దిగడం తెలిసిందే.ఇక ఈ మధ్య ఒక పబ్బులో నానా రచ్చ చేయడంతో కల్పిక పేరు మార్మోగింది. దీనికి సంబంధించి కేసు కూడా అయింది. ఆ గొడవ కాస్త సద్దుమణిగింది అనుకునే లోపే.. కల్పిక ఇప్పుడు కొత్త వివాదంతో వార్తల్లోకి ఎక్కింది. హైదరాబాద్ శివార్లలోని ఒక రిసార్టులో సిబ్బందితో ఆమె గొడవ పడుతున్న సీసీటీవీ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కల్పికకు ఎప్పుడూ ఇదే పనా అంటూ.. నెటిజన్లు ఆమె మీద ఫైర్ అయ్యారు. దీంతో ఆమె ఈ గొడవ గురించి ఒక వీడియో ద్వారా వివరణ ఇచ్చే ప్రయత్నం చేసింది.తన తల్లిదండ్రులతో కలిసి ఇటీవల బ్రౌన్ టౌన్ అనే రిసార్టుకు వెళ్లామని.. అది సిటీకి కొంచెం దూరంగా ఉంటుందని.. ధర తక్కువ అని దాన్ని బుక్ చేశామని.. కానీ అక్కడ సిగ్నల్స్ లేక, వైఫై లేక చాలా ఇబ్బంది పడ్డామని కల్పిక వెల్లడించింది. తన గదిని ఖాళీ చేసి.. అక్కడి నుంచి దూరంగా ఉన్న రిసెప్షన్‌కు వచ్చాక చెక్ ఔట్ చేసే సమయంలో బిల్లు కట్టడంలో ఇబ్బంది తలెత్తిందని ఆమె చెప్పింది. బిల్లు కోసం సిబ్బంది తొందర పెట్టారని.. జీపే ద్వారా బిల్లు చెల్లించానని కల్పిక వెల్లడించింది.క్యాబ్ బుక్ చేసుకుందామన్నా వైఫై పని చేయలేదని.. తమను డ్రాప్ చేయమని అడిగితే రిసార్ట్ సిబ్బంది దురుసుగా మాట్లాడారని ఆమె చెప్పింది. అప్పటికి వాతావరణం చాలా చల్లగా ఉండడంతో తనకు సిగరెట్ తాగాలి అనిపించిందని.. కానీ తన సిగరెట్ ప్యాకెట్ తన గదిలో ఉండిపోయిందని.. దాన్ని తెచ్చి ఇవ్వమంటే స్టాఫ్ తెచ్చి ఇవ్వలేదని.. ఇంతకుముందు ఏ రిసార్ట్‌లోనూ ఇలా జరగలేదని.. వాళ్లు తన సిగరెట్ ప్యాకెట్ తెచ్చి ఇవ్వనందుకు కోపం వచ్చిందని ఆమె చెప్పింది. ఎంత నిదానంగా చెప్పాలని చూసినా వినకపోవడంతో మేనేజర్‌తో గొడవకు దిగాల్సి వచ్చిందని కల్పిక వివరణ ఇచ్చింది.


# బాయ్ ఫ్రెండ్ ని కిడ్నాప్ చేయించిన గర్ల్ ఫ్రెండ్... డిమాండ్ తెలిస్తే షాకే!




**హైదరాబాద్  పెన్ పవర్:** ప్రియుడి కోసం కట్టుకున్న భర్తలకు కడతేర్చుతున్న భార్యలకు సంబంధించిన ఘటనలు వరుసగా హల్ చల్ చేస్తోన్న వేళ.. తాజాగా డబ్బుల కోసం బాయ్ ఫ్రెండ్ ను కిడ్నాప్ చేయించి, చిత్ర హింసలకు గురించేసి, అతడి కుటుంబ సభ్యులకు కాల్ చేసి పెద్ద మొత్తంలో నగదు డిమాండ్ చేసిన గర్ల్ ఫ్రెండ్ వ్యవహారం తాజాగా తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో.. ఈ స్క్రిప్ట్ మామూలుగా లేదనే మాటలు వినిపిస్తున్నాయి.
అవును... డబ్బు కోసం ఓ మహిళ తన బాయ్ ఫ్రెండ్ ను కిడ్నాప్ చేయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. దుబాయ్ కు చెందిన ఓ ట్రావెల్ సంస్థకు మేనేజర్ గా పని చేస్తున్న లారెన్స్ మెల్విన్ ను అతడి గర్ల్ ఫ్రెండ్ మహిమావత్ ఇటీవల బెంగళూరులో కిడ్నాప్ చేయించింది. అనంతరం రూ. 2.5 కోట్లు డిమాండ్ చేసింది. దీంతో... అతడి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.
వివరాల్లోకి వెళ్తే... దుబాయ్ కు చెందిన ట్రావెల్ సంస్థలో మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న లారెన్స్ మెల్విన్ (37).. ఇటీవల తన కుటుంబ సభ్యులు నివసిస్తున్న బెంగళూరుకు వచ్చారు. ఈ క్రమంలో... జులై 16 నుంచి తమ కుమారుడు కనిపించట్లేదని లారెన్స్ తల్లి అశోక్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సమయంలో... కిడ్నాపర్లు ఫోన్ చేసి రూ. 2.5 కోట్లు ఇవ్వాలని బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు!
దీంతో.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. అతడి గర్ల్ ఫ్రెండ్ ఈ కిడ్నాప్ కు పథకాన్ని రచించిందని గుర్తించారు. ఈ సందర్భంగా... సెలవుపై దుబాయ్ నుంచి బెంగళూరు వచ్చిన లారెన్స్.. రెసిడెన్సీ రోడ్ లోని ఒక హోటల్ లో బస చేశారని.. ఈ క్రమంలో జులై 14న అతడి ప్రియురాలు మహిమా బయటకు వెళ్దామని ఆహ్వానించడంతో ఓ కారు బుక్ చేసుకొని వెళ్లారని పోలీసులు తెలిపారు.
ఈ సమయంలో... కొంతదూరం వెళ్లిన తర్వాత, డ్రైవర్ కారును మరో మార్గంలో తీసుకువెళ్లగా అక్కడ మరో ఇద్దరు వ్యక్తులు కారులోకి ఎక్కి లారెన్స్ పై దాడి చేశారని.. అతడి వద్ద ఉన్న రూ.లక్ష నగదు లాక్కొని ఓ అపార్ట్ మెంట్ లో బంధించారని తెలిపారు. ఈ క్రమంలో సుమారు వారం రోజులకు పైగా అతడిని చిత్రహింసలకు గురి చేసినట్లు వెల్లడించారు.అనంతరం.. అతడి కుటుంబ సభ్యులకు కాల్ చేసిన దుండగులు.. రూ. 2.5 కోట్లు డిమాండ్ చేశారని.. అయితే, అదే అపార్ట్‌మెంట్ లో ఉంటున్న ఓ మహిళ నిందితుల తీరు అనుమానాస్పదంగా ఉండడం గమనించి.. వారు లేని సమయంలో బాధితుడిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించిందని తెలిపారు.
ఆ సమాచారంతో స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లారెన్స్ ను రక్షించారు. ఈ క్రమంలో.. ఆర్‌టి నగర్ కు చెందిన మహ్మద్ ఆసిఫ్ రిసల్దార్ (42), మహ్మద్ సోహైల్ షేక్ (25), డిజె హళ్లికి చెందిన సల్మాన్ పాషా (22), కెజి హళ్లికి చెందిన మహ్మద్ నవాజ్ (27) లను అదుపులోకి తీసుకోగా... మహిమా సహా మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.



మౌని రాయ్ ఇన్‌స్టాగ్రామ్ లో తన కొత్త ఆదివారం పోస్ట్‌లో మెరుస్తోంది



# పిరియాడిక్ లవ్ స్టోరీ.. హీరో ఒక్కడే..?

మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ సొంత భాషలో కెరీర్ ఎలా ఉందో కానీ తెలుగులో మాత్రం స్టార్ ఛాన్స్ లతో అదరగొట్టేస్తున్నాడు. దుల్కర్ సినిమా అంటే చాలు తెలుగులో సూపర్ హిట్ అనే బలమైన సెంటిమెంట్ ఏర్పరచుకున్నాడు. మహానటిలో జెమిని గణేషన్ రోల్ కి దుల్కర్ ని చూసి మెచ్చిన తెలుగు ఆడియన్స్ వరుసగా అతని సినిమాలను ఆదరిస్తున్నారు. మహానటి తర్వాత సీతారామం, ఆ తర్వాత లక్కీ భాస్కర్ ఇలా వరుస హిట్లు పడ్డాయి.

**మహానటి కోసం దుల్కర్..**

ముఖ్యంగా వెరైటీ కథ అది కూడా పీరియాడికల్ మూవీ ఐతే దానికి దుల్కర్ ని తీసుకుంటున్నారు. మహానటిలో ఐతే జెమిని గణేశన్ కోసం దుల్కర్ ని తీసుకున్నారు. సీతారామంలో మాత్రం హను తెలుగు హీరో ఒకరిని అనుకున్నా అది సెట్ అవ్వక దుల్కర్ చేశాడు. ఆ సినిమా సూపర్ హిట్ అయ్యింది. ఇక లక్కీ భాస్కర్ కూడా ఒకప్పటి కథలానే చెప్పారు.

ఐతే తెలుగు మేకర్స్ దుల్కర్ తో పీరియాడికల్ కథలే చేస్తున్నాడు. పీరియాడికల్ లవ్ స్టోరీస్, ఇంకా ఒకప్పటి కథలు ఐతే చాలు అది దుల్కర్ తోనే చేయాలని ఫిక్స్ అవుతున్నారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ కాంత సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా కూడా పీరియాడికల్ మూవీగానే వస్తుందట. ఈ మూవీలో రానా కూడా నటిస్తున్నాడు. భాగ్య శ్రీ బోర్స్ హీరోయిన్ గా నటిస్తుంది.

**పాపులారిటీతో కెరీర్ బిజీ..**

దుల్కర్ టేకప్ చేశాడు కాబట్టి కచ్చితంగా సినిమా సంథింగ్ స్పెషల్ అనేలా ఉంటుంది. కాంత తో పాటు దుల్కర్ సొంత భాష మలయాళంలో మరో రెండు సినిమాలు చేస్తున్నాడు. మొత్తానికి తెలుగులో దుల్కర్ కి వచ్చిన ఈ పాపులారిటీ అతని కెరీర్ ని బిజీ చేశాయి. ఎంతగా అంటే సొంత భాషలో సినిమా తీసే టైం లేకుండేలా చేశాయి.దుల్కర్ రానున్న సినిమాలు కూడా ప్రేక్షకులను అలరించేలా ఉంటాయని అనిపిస్తుంది. కాంతా సినిమా భాగ్య శ్రీ కోసం ఇద్దరు హీరోల మధ్య ఫైట్ జరిగేలా ఉంది. దుల్కర్ కి ఈ సినిమా కూడా హిట్ పడితే ఇక అతని రేంజ్ వేరేలా ఉంటుంది. కాంత ఎలా ఉంటుంది.. దుల్కర్ మరోసారి ఎలాంటి కథతో ఆడియన్స్ ముందుకొస్తున్నాడు అన్నది చూడాలి. అతను హీరోగా అనుకుంటే చాలు పీరియాడికల్ మూవీనే అవుతుంది. అది అలా కావాలని జరగకపోయినా ఈ కోఇన్సిడెన్స్ ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేస్తుంది.



సారా గుర్పాల్ తన ప్రకాశవంతమైన వైబ్‌తో మన హృదయాల్లోకి జారిపోయింది

## 89 పరుగులు చేస్తే 89 ఏళ్ళ రికార్డ్ బద్దలు:
# బ్రాడ్‌మాన్ ఆల్‌టైం రికార్డ్‌పై గిల్ గురి



ఇంగ్లాండ్ తో జరుగుతున్న టెస్ట్ సిరీస్ లో టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభమాన్ గిల్ అదరగొడుతున్నాడు. తొలి నాలుగు టెస్టుల్లోనే నాలుగు సెంచరీలు తన ఖాతాలో వేసుకున్నాడు. 8 ఇన్నింగ్స్‌లలో 90.25 సగటుతో 722 పరుగులు చేసి ఈ సిరీస్ లో టాప్ రన్ స్కోరర్ గా నిలిచాడు. ఒక్క లార్డ్స్ టెస్టులో మినహాయిస్తే ప్రతి టెస్టులోనూ పరుగుల వరద పారించాడు. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడుతూ జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. ఇంగ్లాండ్ తో మరో టెస్ట్ ఆడాల్సి ఉంది. గురువారం (జూలై 31) లండన్ లోని ఓవల్ లో వేదికగా చివరి టెస్ట్ జరగనుంది. ఈ మ్యాచ్ కు ముందు గిల్ బ్రాడ్ మాన్, గవాస్కర్ రికార్డులపై కన్నేశాడు. టెస్ట్ కెప్టెన్ గా గిల్ ఒక అరుదైన రికార్డుకు చేరువలో ఉన్నాడు. గిల్ ఐదో టెస్టులో మరో 89 పరుగులు చేస్తే కెప్టెన్ గా తొలి సిరీస్ లోనే అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్ గా రికార్డు సృష్టిస్తాడు. ఇప్పటివరకు ఈ రికార్డ్ బ్రాడ్‌మాన్ పేరిట ఉంది. 1936-37లో ఇంగ్లాండ్‌పై 810 పరుగులు సాధించిన బ్రాడ్ మాన్ ఒకే టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్ గా నిలిచాడు. 89 ఏళ్లుగా ఈ రికార్డ్ బ్రాడ్‌మాన్ పేరిట ఉంది. గిల్ ప్రస్తుతం ఉన్న ఫామ్ కు రెండు ఇన్నింగ్స్ ల్లో 89 పరుగులు చేయడం కష్టం కాకపోవచ్చు.

ఇంగ్లాండ్ తో నాలుగో టెస్ట్ లో సెంచరీ కొట్టిన గిల్.. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒకే సిరీస్‌లో నాలుగు సెంచరీలు సాధించిన మూడో మూడవ కెప్టెన్‌గా నిలిచి అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. గతంలో ఈ ఘనత ఇద్దరు ఆటగాళ్లు మాత్రమే సాధించారు. ఆస్ట్రేలియా ఆల్ టైం బెస్ట్ టెస్ట్

బ్యాటర్ సర్ డాన్ బ్రాడ్‌మాన్ (1947/48), టీమిండియా దిగ్గజ సునీల్ గవాస్కర్ (1978/79) మాత్రమే కెప్టెన్ గా ఒకే సిరీస్ లో నాలుగు సెంచరీలు కొట్టారు. తాజాగా గిల్ నాలుగు సెంచరీలతో వీరి రికార్డ్ సమం చేశాడు. ఈ సిరీస్ లో మరో టెస్ట్ ఉండడంతో చివరి టెస్టులో గిల్ సెంచరీ కొడితే ఒకే టెస్ట్ సిరీస్ లో ఐదు సెంచరీలు చేసిన తొలి కెప్టెన్ గా చరిత్ర సృష్టిస్తాడు.

# ఆట చివర్లో బ్రూక్ తో బౌలింగ్ చేయించడంపై స్టోక్స్ వివరణ

డ్రాగా ముగిసిన ఓల్డ్ ట్రాఫర్డ్ టెస్ట్

అద్భుత పోరాటం కనబర్చిన టీమిండియా

చివర్లో నిర్లక్ష్యంగా బంతులు విసిరిన బ్రూక్

టీమిండియా అభిమానుల ఆగ్రహం



టెస్టు క్రికెట్ చరిత్రలోనే అద్భుత పోరాటం అనదగ్గ రీతిలో ఓల్డ్ ట్రాఫర్డ్ లో టీమిండియా ఆటగాళ్లు అద్వితీయమైన స్ఫూర్తి కనబర్చారు. తద్వారా, ఓటమి తప్పదనుకున్న టెస్టును డ్రాగా ముగించి, సిరీస్ సమం చేసే ఆశలను సజీవంగా నిలుపుకున్నారు. అయితే, నిన్న ఐదో రోజు ఆట చివర్లో టీమిండియా బ్యాటర్లు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ సెంచరీలకు చేరువలో ఉండగా... ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తమ ప్రధాన బౌలర్లను పక్కనబెట్టి హ్యారీ బ్రూక్ ను బౌలింగ్ కు దింపడం విమర్శలకు దారితీసింది. దీనిపై స్టోక్స్ వివరణ ఇచ్చాడు. తమ జట్టుకు గెలుపు అవకాశాలు కనిపించినంత వరకు ప్రధాన బౌలర్లతోనే ఓవర్లు వేయించామని, ఇక డ్రా తప్పదని తేలినప్పుడు వారిపై ఇంకా భారం మోపడం సరికాదనిపించిందని అన్నాడు. అందుకే, పార్ట్ టైమ్ బౌలర్ బ్రూక్ కు బంతి ఇచ్చానని తెలిపాడు. ఇక, మ్యాచ్ ముగిసేందుకు మరో గంట సమయం ఉన్నప్పటికీ... జడేజా, సుందర్ లకు తాను షేక్ హ్యాండ్ ఇచ్చే ప్రయత్నాన్ని కూడా స్టోక్స్ సమర్థించుకున్నాడు. ఇక మ్యాచ్ లో ఫలితం తేలే అవకాశం లేనప్పుడు డ్రా ప్రతిపాదనతో షేక్ హ్యాండ్ ఇవ్వడం సాధారణమైన విషయం అని అన్నాడు. కానీ తన ప్రతిపాదనకు అంగీకరించలేదని, దాంతో, తమ మెయిన్ బౌలర్లకు విశ్రాంతి ఇచ్చి బ్రూక్ తో బౌలింగ్ చేయించానని వివరించాడు. అయితే, బ్రూక్ ఎంతో నిర్లక్ష్యంగా స్లో ఫుల్ టాస్ లు వేయడం, కొట్టుకోండి అన్నట్టు బౌలింగ్ చేయడం భారత అభిమానులను ఆగ్రహానికి గురిచేసింది. దీనిపైనా స్టోక్స్ స్పందించాడు. బౌలింగ్ చేసేటప్పుడు చెత్త పనులు చేయొద్దు... కొత్తగా ఏమీ ట్రై చేయాల్సిన అవసరం లేదు అని బ్రూక్ కు చెప్పానని వెల్లడించాడు.

# చదరంగంలో యువ రాణి దివ్య దేశ్‌ముఖ్.. ఫిడే వరల్డ్ కప్ విజేత సక్సెస్ స్టోరీ



చెస్ బోర్డుపై పట్టు, చదువులోనూ అంతే శ్రద్ధ. అకడమిక్స్, ఆటను అద్భుతంగా సమన్వయం చేసుకుంటూ దేశ చెస్ యవనికపై ఓ నవతార ఉదయించింది. కేవలం 19 ఏండ్లకే ఫిడే వరల్డ్ కప్ గెలిచి చెస్ ప్రపంచాన్ని తనవైపు తిప్పుకుంది నాగ్‌పూర్ సంచలనం దివ్య దేశ్‌ముఖ్. 24 రోజుల పాటు సాగిన ఈ టోర్నమెంట్ అసలేమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన దివ్య ఒక్కో ఎత్తుతో ప్రత్యర్థులకు చెమటలు పుట్టిస్తూ.. ఆఖరాటలో దేశ తొలి మహిళా గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపిను ఓడించి ఒక్కసారిగా అసాధారణ విజేతగా మారింది. డాక్టర్ల ఫ్యామిలీలో పుట్టిన దివ్య స్కెతస్కోప్ కాకుండా చెస్ బోర్డు పట్టుకొని ఈ ఆటలో ఇప్పుడు యువ రాణి అయింది. తన అమ్మనాన్న ఇద్దరూ డాక్టర్లే అయినా.. అక్క షట్లర్ అయినా.. తనను చెస్ బోర్డులోని పావులే ఎక్కువగా ఆకర్షించాయి. చిన్నతనం నుంచే ఆమె చదువుతో పాటు ఆటలోనూ అసాధారణ ప్రతిభ కనబరిచింది. పదేండ్లకే నేషనల్ చాంపియన్‌గా నిలిచిన దివ్య ఇంటర్నేషనల్ ఈవెంట్ల కోసం ప్రపంచమంతా చుట్టివచ్చినా తన చదువును ఎన్నడూ నిర్లక్ష్యం చేయలేదు. హొటల్ గదుల్లో, విమాన ప్రయాణాల్లో, ఆటల విరామ సమయంలో హొంవర్క్ పూర్తిచేసేది. రెగ్యులర్ టెన్త్, ప్లస్2లో డిస్టింక్షన్‌లో పాసైన దివ్య డిస్టెన్స్ డిగ్రీలో తన ఆటకు పనికొచ్చేలా స్పోర్ట్స్ సైకాలజీ, పెర్ఫామెన్స్ సైన్స్, డాటా ఎనలిటిక్స్ సబ్జెక్టులు ఎంచుకుంది.

**చెస్‌లో ధోనీ..**

సూపర్ టాలెంటెడ్ అయిన దివ్య ప్రధాన అస్త్రం ప్రశాంతత. ఎంతటి క్లిష్ట సమయంలోనైనా ఓపిగ్గా, ప్రశాంతంగా ఆడటం ఇండియా క్రికెట్ దిగ్గజం ఎం.ఎస్. ధోనీని గుర్తుకు తెస్తుందని దివ్య మాజీ కోచ్, గ్రాండ్‌మాస్టర్ శ్రీనాథ్ నారాయణన్ అంటున్నాడు. 'దివ్య దూకుడుగా ఆడే ప్లేయర్. కానీ కాలంతో పాటు తన ఆటను మరింత మెరుగుపరుచుకుంది. క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్.. ఇలా అన్ని ఫార్మాట్లలోనూ ఆమె రాణిస్తుంది. అత్యంత కీలకమైన, ఒత్తిడితో కూడిన క్షణాల్లో ఆమె అసలైన సత్తా బయటపడుతుంది. క్రికెట్‌లో చివరి ఓవర్లలో ధోనీ ఎలా మ్యాచ్‌లను గెలిపిస్తాడో, టై-బ్రేక్ వంటి క్లిష్ట పరిస్థితుల్లో దివ్య కూడా అలాంటి అద్భుతాలనే చేస్తుంది' అని కొనియాడాడు. 2020 ఆన్‌లైన్ ఒలింపియాడ్‌లో గోల్డ్ నెగ్గిన ఇండియా తరఫున బరిలోకి దిగిన దివ్య.. చైనా, రష్యా వంటి బలమైన జట్లపై కీలక విజయాలు సాధించిపెట్టి వరల్డ్ చెస్‌లో తన రాకను ఘనంగా చాటింది. 2021లో విమెన్ గ్రాండ్ మాస్టర్ హొదా సాధించిన ఆమె రెండేండ్లు తిరిగేసరికి 2023 ఆసియా విమెన్స్ చాంపియన్ అయింది. గతేడాది వరల్డ్ అండర్20 చాంపియన్‌షిప్ టైటిల్ సొంతం చేసుకున్న దివ్య.. బుడాపెస్ట్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణం గెలిచిన ఇండియా విమెన్స్ టీమ్‌లో దివ్య కీలక మెంబర్. గత నెలలో లండన్‌లో జరిగిన వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ టీమ్ చెస్ చాంపియన్‌లో వరల్డ్ నంబర్ వన్ హౌ యిఫాన్‌ను ఓడించింది. తాజా టోర్నీలో 15వ సీడ్‌గా బరిలోకి దిగినప్పటికీ అద్భుతమైన ఎత్తులతో, మేటి ప్లేయర్లను ఓడించి ఆశ్చర్యపరిచింది. నాలుగో రౌండ్‌లో రెండో సీడ్ జు జినర్, క్వార్టర్ ఫైనల్లో పదో సీడ్ హారిక, సెమీస్‌లో మూడో సీడ్ టాన్ జోంగ్యి పై గెలిచిన ఈ టేనేజర్ చివరకు కోనేరు హంపికు చెక్ పెట్టిన తీరు అద్భుతం. తను ఇదే జోరును కొనసాగిస్తే.. ఇంకో రెండు, మూడేండ్లలో వరల్డ్ చాంపియన్ అయినా ఆశ్చర్యం లేదు. ఏదేమైనా 19 ఏండ్ల దివ్య దేశ్‌ముఖ్ జర్నీ కేవలం ఒక విజయం మాత్రమే కాదు. కొత్త తరానికి స్ఫూర్తినిచ్చే విజయగాథ. చదువును నిర్లక్ష్యం చేయకుండానే ఆటలో శిఖరాలను ఎలా అధిరోహించవచ్చో దివ్య చూపిస్తోంది. ఓవైపు వరల్డ్ చాంపియన్ గుకేశ్?తో పాటు ఎరిగైసి అర్జున్, ప్రజ్ఞానంద వంటి కుర్రాళ్లు దూసుకెళ్తుండగా.. అమ్మాయిల్లో హంపి తర్వాత ఆ స్థాయికి చేరే సత్తా తనకుందని ఈ విజయంతో దివ్య చెప్పకనే చెప్పింది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com